


VARTHAA SAKSHAMU
RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ | సంపుటి : 01 | సంచిక : 87 | గురువారం 27 ఆగష్టు 2026 | పేజీలు : 8 | వెల : 2/-

## ఇక రాష్ట్రమంతటా ‘సంజీవని’..
## సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు



- జనవరి 1 నుంచి ఏపీలో ‘సంజీవని’ ప్రాజెక్టు అమలు
-కుప్పం, చిత్తూరులో విజయవంతం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తరణ
- ఏఐ, డిజిటల్ హెల్త్ రికార్డులకు ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం ఆదేశం
- ప్రజల ఆరోగ్య సమాచారానికి పూర్తి భద్రత, గోప్యత
- కుటుంబాల పై వైద్య ఖర్చుల భారం తగ్గించడమే లక్ష్యం

## మల్లు భట్టివిక్రమార్కతో భేటీ..
## అందుకే కలిశానన్న రాజగోపాల్ రెడ్డి

- భట్టి విక్రమార్కతో భేటీ పై క్లారిటీ ఇచ్చిన రాజగోపాల్ రెడ్డి
- నియోజకవర్గ అభివృద్ధి, నిధుల కోసమే కలిశానని వెల్లడి
- తనది స్వచ్ఛమైన కాంగ్రెస్ రక్తమని వ్యాఖ్య
- కొండా సురేఖ వివాదం పై అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్ అని స్పష్టీకరణ



### రష్యాలో ల్యాండ్ అయిన అమెరికా మిలిటరీకి చెందిన భారీ విమానం..
## అంతర్జాతీయ స్థాయిలో కలకలం

- మాస్కోలో ల్యాండ్ అయిన బోయింగ్ సీ-17 ఏ గ్లోబ్ మాస్టర్ - III విమానం
- రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం తీవ్ర స్థాయికి చేరిన సమయంలో ఊహించని పరిణామం
- అమెరికా సైనిక విమానం పై తమకు ముందస్తు సమాచారం లేదన్న పుతిన్ అధికార ప్రతినిధి



## నేపాల్‌కు అన్ని విధాలా సాయం
## అందిస్తామని ప్రధాని మోదీ హామీ

పొరుగు దేశం నేపాల్‌లో ప్రకృతి బీభత్సం సృష్టించింది. టిబెట్ సరిహద్దుకు సమీపంలో ఆకస్మిక వరదలు పోటెత్తాయి. రసువా జిల్లాలోని భోటేకోశీ నదిలో సంభవించిన ఈ జల ప్రళయంలో ఇప్పటివరకు 22 మంది ప్రాణాలు కోల్పోగా, 105 మంది భారతీయులతో సహా దాదాపు 348 మంది గల్లంతయ్యారు. ఈ ఘటనతో రసువాతో పాటు ధాదింగ్, నువాకోట్ జిల్లాల్లో తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ ఆకస్మిక వరదల్లో అనేక గ్రామాలు, వంతెనలు, రోడ్లు, జలవిద్యుత్ ప్రాజెక్టులు కొట్టుకు పోయాయి.



## ఆ శాఖకు నేను సంరక్షకుడిని మాత్రమే




వ్యాపారమైనా, రాజకీయమైనా తాను నిర్వహించే సంస్థలకు, శాఖలకు కేవలం సంరక్షకుడిని (కస్టోడియన్) మాత్రమేనని, తనకు అప్పగించిన బాధ్యతలను మరింత మెరుగైన స్థితికి తీసుకెళ్లడమే తన లక్ష్యమని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్, మానవ వనరుల శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. పెట్టుబడుల ఆకర్షణలో స్పీడ్, సర్వీస్, స్టెబిలిటీ అనే మూడు సూత్రాలే తమ విజయ రహస్యాలని ఆయన వెల్లడించారు. దేశంలోని యువ వ్యాపారవేత్తలు, ప్రతిభావంతులకు ఫార్చ్యూన్ ఇండియా సంస్థ ‘40 అండర్ 40’ పేరుతో ముంబైలో అవార్డుల ప్రదానోత్సవాన్ని నిర్వహించింది.

## కోదాడలో బస్సు ప్రమాదం..
## స్పందించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



- మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన మంత్రి
- హైదరాబాద్-విజయవాడ హైవేపై కంటైనర్‌ను ఢీకొట్టిన బస్సు
- ప్రమాదంలో ఐదుగురు మహిళలతో సహా ఆరుగురు మృతి
- హైదరాబాద్ నుంచి ఏలూరు వెళుతుండగా తెల్లవారుజామున ఘటన

## కేసీఆర్ పాలన ప్రజా సంక్షేమంగా సాగితే..
## రేవంత్ పాలన భూముల వ్యాపారంగా సాగుతోంది

- కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాల వల్ల హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింటోందన్న హరీశ్
- పార్కులు, ప్లాట్లు, ప్రభుత్వ స్థలాలు కనిపిస్తే అక్కడ భూములను అమ్మేస్తున్నారని ఆరోపణ
- లక్షల ఎకరాల అసైన్డ్ భూములను లాక్కొంటున్నారని మండిపాటు



VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



## నేపాల్‌కు అన్ని విధాలా సాయం అందిస్తామని ప్రధాని మోదీ హామీ

పొరుగు దేశం నేపాల్‌ను భారీ వరదలు ముంచెత్తాయి. రసువా ప్రాంతంలోని భోటే కోశీ నదిలో బుధవారం ఆకస్మికంగా సంభవించిన వరదల కారణంగా పెను విషాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో 100 మందికి పైగా భారతీయులతో సహా వందలాది మంది పర్యాటకులు గల్లంతయ్యారు. ఈ విపత్కర పరిస్థితుల్లో నేపాల్‌కు అండగా నిలుస్తామని భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. బుధవారం నేపాల్ ప్రధాని బాలేంద్ర షాతో ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడారు. వరదల కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపం తెలిపారు. నేపాల్‌కు అవసరమైన అన్ని రకాల మానవతా సాయం అందించేందుకు భారత్ సిద్ధంగా ఉందని ఆయన హామీ ఇచ్చారు. "ఈ కష్టకాలంలో నేపాల్ సోదర సోదరీమణులకు భారత ప్రజలు తోడుగా ఉంటారు. సహాయక చర్యల కోసం మన బృందాలు సమన్వయంతో పనిచేస్తున్నాయి" అని మోదీ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. నేపాల్ టూరిజం బోర్డు (ఎన్టీబీ) విడుదల చేసిన ప్రాథమిక నివేదిక ప్రకారం, ఈ వరదల్లో మొత్తం 384 మంది పర్యాటకులు గల్లంతయ్యారు. వీరిలో 105 మంది భారతీయులు, 93 మంది నేపాల్ పౌరులు, మిగిలిన వారు విదేశీయులు ఉన్నారు. గల్లంతైన విదేశీయులలో యూకే, ఆస్ట్రేలియా, అమెరికా, మలేషియా, దక్షిణాఫ్రికా, నెదర్లాండ్స్ దేశాలకు చెందిన వారు ఉన్నట్లు అధికారులు తెలిపారు. అయితే, ఈ సంఖ్య ప్రాథమికమైనదేనని, ట్రావెల్ ఏజెన్సీలు, స్థానిక అధికారులతో కలిసి వివరాలను ధ్రువీకరిస్తున్నామని ఎన్టీబీ స్పష్టం చేసింది. గల్లంతైన వారు తొమ్మిది వేర్వేరు ట్రావెల్ ఏజెన్సీల ద్వారా నేపాల్ పర్యటనకు వచ్చారని ప్రాథమిక సమాచారం. కాఠ్మండు టైమ్స్ కథనం ప్రకారం, ఈ దుర్ఘటనలో ఇప్పటివరకు ఏడుగురు మరణించినట్లు నిర్ధారణ అయింది. గల్లంతైన వారి ఆచూకీ కోసం అధికారులు, సహాయక బృందాలు ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. సమాచారం లేదా సహాయం కోసం పర్యాటకులు, వారి కుటుంబ సభ్యుల కోసం నేపాల్ టూరిజం బోర్డు పలు ఎమర్జెన్సీ నంబర్లను (1234,1144, 9851289445) జారీ చేసింది. వరద ప్రభావిత ప్రాంతాల్లోని పర్యాటకులు ఆందోళన చెందవద్దని, అధికారిక ప్రకటనలను అనుసరించాలని సూచించింది.

## రష్యాలో ల్యాండ్ అయిన అమెరికా మిలిటరీకి చెందిన భారీ విమానం.. అంతర్జాతీయ స్థాయిలో కలకలం

మాస్కోలోని వ్నుకోవో అంతర్జాతీయ విమానాశ్రయంలో అమెరికా వైమానిక దళానికి చెందిన భారీ 'బోయింగ్ సీ-17 ఏ గ్లోబ్ మాస్టర్-III' రవాణా విమానం అకస్మాత్తుగా ల్యాండ్ కావడం అంతర్జాతీయ స్థాయిలో తీవ్ర కలకలం రేపింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు గరిష్ఠ స్థాయికి చేరిన సమయంలో, పరస్పరం వైమానిక ఆంక్షలు విధించుకున్న తరుణంలో ఒక అమెరికన్ సైనిక విమానం నేరుగా మాస్కోలో అడుగుపెట్టడంపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఫ్లైట్‌ట్రాకింగ్ వెబ్‌సైట్ 'ఫ్లైట్‌రాడార్24' ఆధారంగా వెల్లడైన వివరాల ప్రకారం... ఈ గ్లోబ్‌మాస్టర్ విమానం మొదట అమెరికాలోని వాషింగ్టన్ డీసీ సమీపంలో ఉన్న జాయింట్ బేస్ ఆండ్రూస్ మిలిటరీ స్థావరం నుంచి బయలుదేరింది. ఆ తర్వాత లాట్వియా రాజధాని రీగాలో ఆగింది. మంగళవారం ఉదయం రీగా నుంచి బయలుదేరిన రెండు గంటల్లోనే రష్యా వాయుసేన అనుమతితో మాస్కోలోని వ్నుకోవో విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండ్ అయింది. అయితే ఈ విమానంలో ప్రయాణిస్తున్నదెవరు, దేనికోసం వచ్చిందనేది మొదట మిస్టరీగా మారింది. ఈ ఆకస్మిక ల్యాండింగ్‌పై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అధికారిక ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ మీడియాతో మాట్లాడుతూ... మాస్కోలో ల్యాండ్ అయిన అమెరికా సైనిక విమానం గురించి తమ వద్ద ఎలాంటి ముందస్తు సమాచారం లేదని వ్యాఖ్యానించారు. అంతేకాకుండా, ఈ వారంలో అమెరికా పాలనా యంత్రాంగ ప్రతినిధులతో ఎలాంటి ముందస్తు సమావేశాలు ఖరారు కాలేదని స్పష్టం చేయడంతో సస్పెన్స్ మరింత పెరిగింది. అయితే, అమెరికా మీడియా కథనాల ప్రకారం... అమెరికా నిఘా సంస్థ 'సీఐఏ' డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్ రహస్య పర్యటనలో భాగంగా ఈ విమానంలో మాస్కోకు చేరుకున్నట్లు సమాచారం వెలువడింది. రష్యా నిఘా వర్గాల ఉన్నతాధికారులతో చర్చలు జరిపేందుకే ఆయన అక్కడకు వెళ్లినట్లు తెలుస్తోంది. గతంలో ఖైదీల మార్పిడి ఒప్పందాలు లేదా ఉక్రెయిన్ సంక్షోభంపై చర్చల సందర్భాల్లోనూ ఇలాంటి రహస్య పర్యటనలు జరిగిన నేపథ్యంలో, ఈ పర్యటన వెనుక అసలు ఉద్దేశం ఏమిటనే దానిపై అంతర్జాతీయ రాజకీయ వేదికలపై తీవ్రంగా చర్చ జరుగుతోంది.

## కోదాడలో బస్సు ప్రమాదం.. స్పందించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

సూర్యాపేట జిల్లా కోదాడ మండలం ద్వారకుంట వద్ద ప్రైవేటు బస్సు ప్రమాదానికి గురైన ఘటనపై తెలంగాణ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో పలువురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని పేర్కొన్న ఆయన, ఈ మేరకు 'ఎక్స్' వేదికగా స్పందించారు. మృతుల కుటుంబాలకు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. ప్రమాదంలో గాయపడిన వారికి తక్షణమే మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లాలో బుధవారం తెల్లవారు జామున ఈ ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై నిలిపి ఉంచిన కంటైనర్ ట్రక్కును ఒక ప్రైవేటు బస్సు వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఐదుగురు మహిళలతో సహా మొత్తం ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందగా, మరో 20 మందికి పైగా ప్రయాణికులు గాయపడ్డారు. ఈ ఘటనపై మంత్రి తీవ్రంగా స్పందించారు.

# మల్లు భట్టివిక్రమార్కతో భేటీ.. అందుకే కలిశానన్న రాజగోపాల్ రెడ్డి

తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో జరిగిన భేటీ పై మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పష్టత ఇచ్చారు. బుధవారం ప్రజాభవన్‌లో ఉపముఖ్యమంత్రిని కలిసిన ఆయన, కేవలం నియోజకవర్గ అభివృద్ధి, నిధుల కేటాయింపులపై చర్చించేందుకే ఈ భేటీ జరిగిందని వివరించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన రాజగోపాల్ రెడ్డి, తాను కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తున్న సీనియర్ నాయకుడినని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తాను తీవ్రంగా వ్యతిరేకించానని, 2018 ఎన్నికల్లో ఎంతోమంది సీనియర్లు ఓటమి పాలైనప్పటికీ మునుగోడు ప్రజలు తన వెంటే నిలిచారని ఆయన గుర్తుచేశారు. తన వ్యాఖ్యలు పార్టీ బలోపేతం కోసమే తప్ప, ఎవరినీ వ్యక్తిగతంగా విమర్శించేందుకు కాదని స్పష్టం చేశారు. "మాది స్వచ్ఛమైన కాంగ్రెస్ రక్తం. ఎన్నికల సమయంలో కొత్తగా వచ్చిన వారికి టికెట్లు కేటాయించారు. అయితే, పార్టీని నమ్ముకున్న కార్యకర్తలను కాపాడుకోవాల్సిన బాధ్యత నాయకత్వంపై ఉంది" అని ఆయన వ్యాఖ్యానించారు. మంత్రి కొండా సురేఖకు సంబంధించిన వివాదంపై స్పందిస్తూ, ఈ విషయంలో పార్టీ అధిష్ఠానం నిర్ణయమే అంతిమమని రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే స్పందించారని, క్రమశిక్షణ సంఘం కూడా సంబంధిత వ్యాఖ్యలపై పీసీసీకి నివేదిక సమర్పించిందని తెలిపారు. తనపై విమర్శలు చేసే వారు ముందుగా ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించిన ఆయన, తాను ఎల్లప్పుడూ పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి ఉంటానని వెల్లడించారు. రాహుల్ గాంధీని దేశ ప్రధానిని చేయడమే తమ ప్రధాన లక్ష్యమని రాజగోపాల్ రెడ్డి పునరుద్ఘాటించారు.

# ఇక రాష్ట్రమంతటా 'సంజీవని'.. సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు

ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతూ 'సంజీవని' ప్రాజెక్టును జనవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. కుప్పం, చిత్తూరు నియోజకవర్గాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేసిన ఈ ప్రాజెక్టు అద్భుతమైన ఫలితాలు ఇవ్వడంతో, దీనిని రాష్ట్రమంతా విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన 90 రోజుల కార్యాచరణ ప్రణాళికను అధికారులు సీఎంకు వివరించారు. ఈ సమీక్ష సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఆధారిత ఆరోగ్య సేవలు, ప్రతి పౌరునికి డిజిటల్ హెల్త్ రికార్డులు, వ్యాధుల ముందస్తు గుర్తింపు, సరైన చికిత్స, ఆ తర్వాత ఫాలో-అప్‌కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. డిజిటల్ హెల్త్ రికార్డులతో ఈ ప్రాజెక్టును పూర్తిస్థాయిలో అమలు చేస్తే వైద్య సేవల్లో పెను మార్పులు తీసుకురావచ్చని, దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆంధ్రప్రదేశ్ ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రజల ఆరోగ్య సమాచారం యొక్క గోప్యతకు, భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని చంద్రబాబు అధికారులను గట్టిగా ఆదేశించారు. ప్రతి వ్యక్తి ఆరోగ్యానికి సంబంధించిన అప్‌డేట్‌లను నేరుగా వారి మొబైల్ ఫోన్‌లకే పంపేలా వ్యవస్థను తీర్చిదిద్దాలని సూచించారు. వ్యాధులను ముందుగానే గుర్తించి, నివారణ చర్యలు చేపట్టడం, సరైన సమయంలో చికిత్స అందించడం ద్వారా కుటుంబాల పై పడే వైద్య, విద్యా ఖర్చుల భారాన్ని గణనీయంగా తగ్గించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. ఈ లక్ష్య సాధనలో 'సంజీవని' ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తుందని ప్రభుత్వం విశ్వసిస్తోంది.

# ఆ శాఖకు నేను సంరక్షకుడిని మాత్రమే

ఈ కార్యక్రమానికి కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్, మంత్రి నారా లోకేశ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ వేడుకలో భాగంగా, డైరీ రంగంలో విలువ ఆధారిత ఉత్పత్తుల విభాగంలో హెరిటేజ్ సంస్థ సాధించిన ప్రగతికి గాను, ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రహ్మణికి కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ చేతుల మీదుగా 'ఫార్చ్యూన్ ఇండియా 40 అండర్ 40' అవార్డును ప్రదానం చేశారు. అనంతరం జరిగిన ఇంటరాక్టివ్ సెషన్‌లో మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. ఆర్పీఎస్జీ గ్రూప్ వైస్ చైర్మన్ శాశ్వత్ గోయెంకా అడిగిన పలు ప్రశ్నలకు ఆయన ఆసక్తికర సమాధానాలిచ్చారు. "ప్రభుత్వ నిర్వహణలో మీరు క్రమశిక్షణ పాటిస్తున్నారు. పొదుపు గురించి మాట్లాడారు. ఈ ఆలోచన మీకు ఎక్కడి నుంచి వచ్చింది?" అని గోయెంకా ప్రశ్నించగా, లోకేశ్ బదులిచ్చారు. "వ్యాపారంలో అయినా, రాజకీయాల్లో అయినా మనం నిర్వహించే సంస్థలకు కేవలం సంరక్షకులం మాత్రమేనని నేను బలంగా నమ్ముతాను. ఒక మంత్రిగా నేను ఇక్కడికి వచ్చింది కేవలం మానవ వనరుల అభివృద్ధి, విద్యాశాఖకు సంరక్షకుడిగా మాత్రమే. గతంలో వ్యాపారంలో, ఇప్పుడు ప్రభుత్వ బాధ్యతల్లోనూ ఇదే విధానాన్ని అనుసరిస్తున్నాను" అని వివరించారు. పెట్టుబడుల కోసం అన్ని రాష్ట్రాలు పోటీ పడుతున్న తరుణంలో ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా నిలబెట్టేది ఏమిటన్న ప్రశ్నకు లోకేశ్ రెండు ప్రధాన కారణాలను తెలిపారు. "మొదటిది, మేము అనుసరించే మూడు 'ఎస్'ల విధానం. స్పీడ్ (వేగం), సర్వీస్ (సేవ), స్టెబిలిటీ (స్థిరత్వం). మేము ఎంత వేగంగా అనుమతులు ఇస్తున్నామో చాలా పరిశ్రమలకు తెలుసు. ఇక సర్వీస్ విషయానికొస్తే, పెట్టుబడిదారులకు వారి ప్రాజెక్టుల పురోగతిపై ప్రతి శనివారం రాత్రి నేనే స్వయంగా మెసేజ్ పంపి ఫీడ్‌బ్యాక్ ఇస్తాను. మూడోది, విధానాల్లో స్థిరత్వం. ప్రభుత్వాలు మారినా మా విధానాలు కొనసాగుతాయి. ఇది పెట్టుబడిదారులకు భరోసా ఇస్తుంది" అని లోకేశ్ అన్నారు. "రెండో ముఖ్య కారణం ముఖ్యమంత్రి చంద్రబాబు గారు. సీబీఎన్ అంటే అదొక బ్రాండ్. ఆయనకు అద్భుతమైన ట్రాక్ రికార్డు ఉంది. పెట్టుబడులకు అవసరమైన తలుపులు తెరువగల ముఖ్యమంత్రి ఉండటంతో మా పని సగం సులభమవుతుంది. మిగిలిన సగం పనిని నేను సమావేశ మందిరంలో ఒప్పందాన్ని ఖరారు చేయడం ద్వారా పూర్తి చేస్తాను. మా ఇద్దరి భాగస్వామ్యమే ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా నిలుపుతోంది" అని లోకేశ్ తెలిపారు.

## కేసీఆర్ పాలన ప్రజా సంక్షేమంగా సాగితే.. రేవంత్ పాలన భూముల వ్యాపారంగా సాగుతోంది

కేసీఆర్ పాలన ప్రజా సంక్షేమ కేంద్రంగా సాగితే, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి పాలన భూముల వ్యాపారం కేంద్రంగా నడుస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల వల్ల హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింటోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో ఈరోజు ఏర్పాటు చేసిన 22ఏ బాధితుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ఎక్కడ పార్కులు, ప్లాట్లు, ప్రభుత్వ స్థలాలు కనిపిస్తే అక్కడ భూములను విక్రయిస్తూ భావి తరాలకు కనీసం స్థలం కూడా లేకుండా చేస్తున్నారని హరీశ్ రావు ఆరోపించారు. సామాన్య ప్రజల ఆస్తులనేమో 22ఏ నిషేధిత జాబితాలోకి నెడుతూ, ప్రభుత్వ భూములను మాత్రం ముఖ్యమంత్రి సోదరుల చేతుల్లోకి వెళ్లేలా చేస్తున్నారని విమర్శించారు. లక్షలాది ఎకరాల అసైన్డ్ భూములను పేదల వద్ద నుంచి లాక్కొని, కమీషన్ల కోసం పారిశ్రామికవేత్తలకు కట్టబెడుతున్నారని మండిపడ్డారు. ఎప్పుడు 'హైడ్రా' వచ్చి ఇళ్లను కూలుస్తుందో, ఎప్పుడు 22ఏ పేరుతో తమ భూములను గుంజుకుంటారోనని ప్రజలు భయాందోళనలతో బతుకుతున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు కోటి ఎకరాలను, ఒక్క హైదరాబాద్‌లోనే లక్షలాది ఆస్తులను రేవంత్ ప్రభుత్వం 22ఏ జాబితాలో చేర్చిందని ఆరోపించారు. ప్రభుత్వం చేసిన తప్పుకు ప్రజలను ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిప్పుతూ... జాబితా నుంచి భూములను తొలగించడానికి 30 శాతం వరకు కమీషన్లు వసూలు చేస్తున్నారని విమర్శించారు. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఈ 22ఏ అంశంపై ప్రభుత్వాన్ని తీవ్రంగా నిలదీస్తామని స్పష్టం చేశారు. బాధితులు ఎవరూ బ్రోకర్లకు ఒక్క రూపాయి కూడా ఇవ్వొద్దని, ప్రజల ఆస్తులను కాపాడే బాధ్యతను బీఆర్ఎస్ పూర్తిగా తీసుకుంటుందని హామీ ఇచ్చారు.

# తెలంగాణ వేదికగా 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్'

భారతదేశ యువశక్తికి సరైన క్రీడా సదుపాయాలను, అవసరమైన ప్రోత్సాహాన్ని కల్పించి వారిలోని శక్తిసామర్థ్యాలకు పదునుపెట్టడంతోపాటుగా వారికి క్రీడా రంగంలో ఉజ్వలమైన భవిష్యత్తును అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తోంది. అందుకోసం గత 12 ఏళ్లుగా వివిధ కార్యక్రమాలతోపాటు పథకాలను తీసుకొచ్చింది. 'ఖేలో ఇండియా' కార్యక్రమం ద్వారా.. దేశంలోని యువ క్రీడాశక్తిని ప్రోత్సహించేందుకు దేశవ్యాప్తంగా.. 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్', 'ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్', 'ఖేలో ఇండియా పారా గేమ్స్', 'ఖేలో ఇండియా వింటర్ గేమ్స్', 'ఖేలో ఇండియా బీచ్ గేమ్స్', 'ఖేలో ఇండియా వాటర్ స్పోర్ట్స్ ఫెస్టివల్', 'ఖేలో ఇండియా ట్రైబల్ గేమ్స్' వంటి క్రీడా పోటీల నిర్వహణ ద్వారా క్రీడాకారులు తమలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను, తమలోని నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి ఒక వేదికను ఏర్పాటు చేసింది. ఇప్పటి వరకు జరిగిన 24 ఎడిషన్ల 'ఖేలో ఇండియా ' పోటీల్లో దేశం నలుమూలల నుంచి 60 వేల మందికిపైగా క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ పరంపరలో భాగంగా.. ఈ ఏడాది జరగనున్న 8వ ఎడిషన్ 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్' ను తెలంగాణలో నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్ వేదికగా ఈ పోటీలను నిర్వహించనున్నారు. ఈ ఎడిషన్‌లో మొత్తం 25 క్రీడల్లో పోటీలు నిర్వహించనున్నారు. ఆతిథ్య రాష్ట్రమైన తెలంగాణ.. ఒక స్థానిక క్రీడను ప్రతిపాదించవచ్చు. దీంతో పాటుగా మరో కొత్త క్రీడను కూడా ఈ ఈవెంట్లో ఆడించనున్నారు. ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 6వేల మంది క్రీడాకారులు పాల్గొంటారని అంచనా. ఈ 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్' నిర్వహణకోసం.. కేంద్ర ప్రభుత్వం రూ.22 కోట్లను విడుదల చేసింది. ఈ క్రీడా పోటీలను రాష్ట్ర ప్రభుత్వం, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా , నేషనల్ స్పోర్ట్స్ ఫెడరేషన్ , స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా , సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్, ఖేలో ఇండియా పథకం అడ్‌హక్ కమిటీ, స్టీరింగ్ కమిటీల సంయుక్త నిర్వహణలో నిర్వహించనున్నారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను తెలంగాణకు కేటాయించడం పట్ల.. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి, కేంద్ర యువజన సర్వీసులు, క్రీడా శాఖల మంత్రి మన్‌సుఖ్ మాండవీయకు ధన్యవాదాలు తెలియజేశారు. భారత యువతలో అపారమైన క్రీడా ప్రతిభ ఉందని, వారికి తగిన క్రీడా సదుపాయాలు కల్పించడం, అవసరమైన ప్రోత్సాహాన్ని అందించడం, ప్రతిభను వెలితీయడంలో గత ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం వహించాయని విమర్శించారు. స్పోర్ట్స్ బడ్జెట్‌ను పూర్తిగా నిర్లక్ష్యం చేశాయని ఆరోపించారు. 2014లో కేంద్రంలో మోదీ ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన తర్వాత స్పోర్ట్స్ బడ్జెట్ కేటాయింపులు పెరిగాయని, ఖేలో ఇండియా వంటి పథకాల ద్వారా దేశంలోని మారుమూల ప్రాంతాలలో ఉన్న క్రీడా ప్రతిభకు సరైన ప్రోత్సాహం లభిస్తోందని పేర్కొన్నారు. 'ఖేలో ఇండియా' స్కీమ్‌లో భాగంగా.. తెలంగాణలో కూడా దాదాపు రూ.30 కోట్లతో క్రీడా సదుపాయాల కల్పన జరిగిందని, అందులో రూ.11.5 కోట్లతో ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో సింథటిక్ ట్రాక్, సింథటిక్ టెన్నిస్ కోర్ట్, మహిళల కోసం ప్రత్యేక స్విమ్మింగ్ పూల్ వంటి సౌకర్యాలను కల్పించారని, మరో రూ.18.5 కోట్లతో రాష్ట్రంలోని వివిధ పట్టణాలలో క్రీడా సదుపాయాలను కల్పించారని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణలో 33 ఖేలో ఇండియా సెంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

# సంపాదకీయం

## వానను ఒడిసిపట్టే యాగం ఎప్పుడు?



ఇరవై ఒకటో శతాబ్దంలో కూడా మనం వాన కోసం ప్రార్థించాలా? లేక పడిన కొన్ని చినుకులనైనా వృథా కాకుండా ఒడిసిపట్టాలా? వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఇటీవల వరుణ యాగం నిర్వహించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దంపతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వర్షం కోసం ప్రార్థనలు చేయడం మన సంప్రదాయంలో భాగమే. ప్రకృతిని దేవతగా భావించి వర్షాన్ని కోరుకోవడం అనాదిగా వస్తున్న విశ్వాసం. అయితే వ్యక్తిగత విశ్వాసం ఒకటి, ప్రభుత్వ పాలనలో అనుసరించాల్సిన శాస్త్రీయ విధానం మరొకటి.యాగం లేదా ప్రార్థన వల్ల వర్షం కురుస్తుందని నిరూపించే శాస్త్రీయ ఆధారాలు లేవు. రుతుపవనాల కదలిక, సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు, వాతావరణ పీడన వ్యవస్థలు, గాలుల దిశ, ఎల్‌నినో వంటి సముద్ర వాతావరణ పరిణామాలు వర్షపాతాన్ని ప్రభావితం చేస్తాయి. ఈ ప్రక్రియలను మనిషి తన ప్రార్థనలతో నియంత్రించలేడు. కానీ వర్షం పడిన తర్వాత ఆ నీటిని ఎలా ఉపయోగించుకోవాలి, ఎంత నీటిని భూమిలోకి ఇంకించాలి, ఎంత నీటిని నిల్వ చేయాలి అన్నది మాత్రం మన చేతుల్లోనే ఉంది. వర్షం తక్కువగా పడినప్పుడు నీటి కొరతను ఎదుర్కొంటాం. భారీ వర్షం పడినప్పుడు వరదలను ఎదుర్కొంటాం. ఒకే సమయంలో ఈ రెండు సమస్యలను ఎదుర్కొంటున్నామంటే సమస్య వర్షంలోనే లేదని అర్థం. వర్షపు నీటిని నిర్వహించడంలో మన వైఫల్యం ఉంది. ఇలాంటి వైఫల్యాలను అధిగమించిన రైతుల చరిత్ర తెలంగాణలో ఉంది. వాననీటిని ఒడిసిపడితే భూగర్భదాహం తీరుతుందని సంగారెడ్డి జిల్లా, కోహీర్ మండలంలోని గొడిగార్‌పల్లి రైతులు నిరూపించారు. అక్కడ సాగుభూమి 1200 ఎకరాలు. ఒకప్పుడు తాగడానికి కూడా నీళ్లు లేక గ్రామస్థులు ఇబ్బందులు పడేవారు. చినుకులు పడితే పంట, లేదంటే వలసలే. అలాంటి కరువు నేలలో 2019లో ఐక్యరాజ్యసమితి సలహాదారు టి.హన్మంతరావు ఆ గ్రామస్థులను జల సంరక్షణలో భాగస్వాములను చేశారు. చతుర్విధ జలప్రక్రియ అనే ప్రాజెక్ట్‌ను అమలు చేశారు. అవి-- 1. వాన నీరు 2. ఉపరితల నీరు 3. భూగర్భ నీరు 4. భూమిలో తేమను ఎలా పెంచి వినియోగించుకోవాలో చెప్పే శాస్త్రీయ పద్ధతి. ఈ ప్రక్రియలో భాగంగా వాన నీరు భూమిలో ఇంకేలా, ప్రవహించే నీరు లోతట్టుకు వెళ్లకుండా వాలుకు అడ్డంగా చిన్న గుంతలు, కందకాలు తవ్వారు. భూగర్భ జలాలు పెంచడానికి ఊట గుంతలు, పంట కుంటలు తవ్వారు. ఇదంతా గ్రామస్థుల శ్రమదానంతో చేసుకున్నారు. దీనివల్ల పడిన వర్షం అంతా ఊరి పొలిమేరలు దాటకుండా వారి పొలాల్లోనే ఇంకుతుంది. ఫలితంగా గ్రామంలోని బోర్లలో నీటి మట్టం పెరిగింది, ఇప్పుడు వారు మూడు పంటలు పండిస్తున్నారు. వానలు సకాలంలో పడనప్పుడు కూడా సాగునీటికి ఇబ్బందులు లేకుండా సేద్యం చేస్తున్నారు. తెలంగాణ రైతులు అనుసరించిన చతుర్విధ జలప్రక్రియ రాజస్థాన్‌కు స్ఫూర్తినిచ్చింది. ఇదే విధానాన్ని ఇప్పుడు రాష్ట్రమంతటా అమలు చేయడానికి ప్రభుత్వం ప్రణాళిక తయారుచేయాలి.ఒక భారీ వర్షం కురిసి గంటల్లోనే ఆ నీరు వరదలా పారి వృథాగా పోయే కంటే, అదే నీటిని చిన్న చిన్న కుంటలు, చెక్‌డ్యామ్‌లు, ఫామ్ పాండ్లు, ఇంకుడు గుంతలు, కాంటూర్ ట్రెంచ్‌లు, పర్కొలేషన్ ట్యాంకులు, చెరువుల ద్వారా భూమిలోకి పంపడం ఎంతో విలువైనది. వర్షాన్ని కురిపించడం మన చేతుల్లో లేకపోవచ్చు. కానీ వర్షాన్ని భూమిలోకి పంపించడం మాత్రం మన చేతుల్లోనే ఉంది. అందుకే ప్రభుత్వం వర్షాల కోసం ఒక యాగం నిర్వహించినప్పుడు, అదే సమయంలో రాష్ట్రంలోని ఎన్ని గ్రామాల్లో ఇంకుడు గుంతలు తవ్విస్తున్నారు? ఎన్ని చెరువులను పూడిక తీసి పునరుద్ధరిస్తున్నారు? ఎన్ని చెక్‌డ్యామ్‌లు నిర్మిస్తున్నారు? ఎన్ని ఫామ్ పాండ్లను ప్రోత్సహిస్తున్నారు? ఎన్ని ప్రభుత్వ భవనాల్లో పైకప్పు వర్షపు నీటిని భూగర్భజలాల్లోకి పంపిస్తున్నారు? ఈ ప్రశ్నలే శాస్త్రీయ పాలనకు కొలమానాలు కావాలి. తెలంగాణకు నీటిని నిల్వ చేసుకునే గొప్ప సంప్రదాయం ఉంది. చెరువులు, కుంటలు, వాగులు, కాలువలు, కట్టలు మన పూర్వీకులు అభివృద్ధి చేసిన స్థానిక నీటి విజ్ఞానానికి ప్రతీకలు. కాకతీయుల చెరువుల వ్యవస్థ నుంచి గ్రామీణ కుంటల వరకు, తెలంగాణ భూభాగం వర్షపు నీటిని పట్టుకోవడానికి అనేక స్థానిక పద్ధతులను అభివృద్ధి చేసుకుంది. ప్రకృతితో కలిసి జీవించాల్సిన అవసరాన్ని అప్పటి సమాజం అర్థం చేసుకుంది.

# డీలిమిటేషన్‌ను అడ్డుకుంటే దక్షిణాదికి ద్రోహమే!




ఈ పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు దేశ ప్రజాస్వామ్యానికి, ఆంధ్రప్రదేశ్ సహా దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ఉనికికి అత్యంత కీలకమైనవి. గత సమావేశాల్లో రాజకీయ పంతాలకే ప్రాధాన్యమిచ్చిన కాంగ్రెస్, తృణమూల్, డీఎంకే, సమాజ్‌వాదీ వంటి విపక్షాల సంకుచిత వైఖరి వల్ల 131వ రాజ్యాంగ సవరణ-- డీలిమిటేషన్ బిల్లు ఆగిపోయింది. ప్రస్తుత సమావేశాల్లో ఎన్డీఏ ప్రభుత్వం డీలిమిటేషన్ బిల్లును అధికారిక ఎజెండాలో పెట్టనప్పటికీ, సప్లిమెంటరీ బిల్లు రూపంలో తెచ్చే అవకాశాలు ఉన్నాయి. విపక్షాలు మళ్లీ ఏకతాటిపైకి వచ్చి అడ్డుకోకుండా ఉండేందుకే ప్రభుత్వం ఈ వ్యూహాత్మక నిశ్శబ్దాన్ని పాటిస్తోంది. లోక్‌సభలో శివసేన షిండే గ్రూపునకు చెందిన ఆరుగురు ఎంపీలకు విడిగా గ్రూప్ హోదా దక్కడం, తృణమూల్ కాంగ్రెస్ విలీనవర్గం ఆమోదం పొంది ప్రత్యేక గ్రూపుగా గుర్తింపు రావడం, శరద్ పవార్ వర్గం కూడా బిల్లుకు అనుకూలంగా ఓటు వేసే దిశగా అడుగులు వేస్తుండటం, విపక్ష కూటమిలోని డీఎంకే ఓటింగ్‌కు దూరంగా ఉండాలనే యోచనలో ఉండటం వంటి పరిణామాలు సభలో సరికొత్త రాజకీయ చిత్రపటాన్ని ఆవిష్కరించాయి. తాజా రాజకీయ లెక్కల ప్రకారం.. షిండే గ్రూప్, టీఎంసీ శకలాలు, స్వతంత్రులు, చిన్న పార్టీలు కలుపుకుని ఎన్డీఏ వైపు 315 నుంచి 319 మందిని దాటి బలంగా ఉండటంతో విపక్షాల పాత వ్యూహాలు ఇక సాగవు.

జనాభా ప్రాతిపదికన పార్లమెంట్ స్థానాల పునర్విభజన జరిగితే, జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయన్న ఆందోళన పాతదే. రాజ్యాంగంలోని ఆర్టికల్ 81 ప్రకారం, లోక్‌సభ స్థానాల కేటాయింపు జనాభా ప్రాతిపదికన జరగాలి. 1976లో ఇందిరాగాంధీ 42వ రాజ్యాంగ సవరణ ద్వారా 1971 జనాభా లెక్కల ఆధారంగా సీట్ల సంఖ్యను 2000 సంవత్సరం వరకు స్తంభింప జేశారు. 2001లో వాజపేయి హయాంలో అప్పటి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవ తీసుకొని, కుటుంబ నియంత్రణ పాటించినందుకు దక్షిణాది రాష్ట్రాలను రాజకీయంగా శిక్షించకూడదని గట్టిగా వాదించి, కేంద్రంపై ఒత్తిడి తెచ్చి 84వ రాజ్యాంగ సవరణలో కీలకపాత్ర వహించారు. తద్వారా ఈ స్తంభనను మరో 25 ఏళ్లు-- 2026 తర్వాత జరిగే మొదటి జనాభా లెక్కల వరకు పొడిగించారు. ఆ చారిత్రక చొరవ వల్లనే గత పాతికేళ్లుగా దక్షిణాది రాష్ట్రాల రాజకీయ బలం, జాతీయ స్థాయి ప్రాధాన్యం రక్షించబడుతూ వచ్చాయి. ఆర్టికల్ 81(3) నిబంధన ప్రకారం, 1971 నాటి జనాభా లెక్కల ఆధారంగా ఉన్న సీట్ల స్తంభన 2026తో ముగుస్తుంది. తదుపరి జనాభా లెక్కల తర్వాత డీలిమిటేషన్ అనివార్యం అవుతుంది. 2011 జనాభా లెక్కలను లేదా భవిష్యత్ జనాభా గణాంకాల ఆధారంగా సీట్ల పునఃకేటాయింపు చేస్తే ఘోరమైన అసమతుల్యత ఏర్పడుతుంది. జనాభా విస్ఫోటనంతో ఉత్తరాది రాష్ట్రాల సీట్లు భారీగా పెరిగి, జనాభాను క్రమశిక్షణతో అదుపు చేసిన ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక వంటి రాష్ట్రాల సీట్ల శాతం జాతీయ స్థాయిలో దారుణంగా పడిపోతుంది. లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచకుండా పాత 543 స్థానాల పరిమితిలోనే పునర్విభజన చేస్తే, తమిళనాడు సీట్లు 39 నుంచి 32కి, కేరళ సీట్లు 20 నుండి 15కి తగ్గిపోయే ప్రమాదం ఉంది. ఇది సమాఖ్య స్ఫూర్తికే తీరని విఘాతం. ఈ భౌగోళిక-- రాజకీయ అసమతుల్యతను నివారించడానికి ఎన్డీఏ ప్రతిపాదించిన న్యాయబద్ధమైన రాజ్యాంగ రక్షణ కవచం-- లోక్‌సభ మొత్తం స్థానాల సంఖ్యను ప్రస్తుతం ఉన్న 543 నుంచి గరిష్ఠంగా 850 లేదా 50శాతం అదనపు స్థానాలకు పెంచడం అనే మోడల్-- ఓడిపోయింది. కేంద్రం తెచ్చిన 'ప్రొపోర్షనల్ ఇంక్రీజ్ మోడల్' (సమాన నిష్పత్తి పెంపుదల విధానం) ప్రకారం జాతీయ స్థాయిలో ఏ రాష్ట్రానికి ప్రస్తుతం ఎంత శాతంలో ఎంపీ సీట్ల ప్రాతినిధ్యం ఉందో, పార్లమెంట్ విస్తరణ తర్వాత కూడా అదే శాతం ప్రాతినిధ్యం కొనసాగుతుంది. అంటే ఎవరి జాతీయ వాటా తగ్గకుండా అందరికీ సీట్లు పెరుగుతాయి.

ఈ బిల్లు ప్రకారం, విస్తరణ తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత 25 లోక్‌సభ స్థానాలు 38కి, తెలంగాణలో 17 నుంచి 26 సీట్లకు, తమిళనాడులో 39 నుంచి 59 సీట్లకు పెరుగుతాయి. ప్రస్తుతం దక్షిణాదికి ఉన్న 129 లోక్‌సభ స్థానాలు ఏకంగా 195 స్థానాలకు పెరుగుతాయి. దీనివల్ల పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాల మొత్తం ప్రాతినిధ్యం దాదాపు 24 శాతంగానే స్థిరంగా, ఉత్తరాది రాష్ట్రాల పెరిగిన జనాభాకు ప్రాతినిధ్య న్యాయం జరుగుతుంది. అదే సమయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించిన దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాధాన్యానికి ఎలాంటి భంగం కలగదు. ఇది అసలైన 'విన్--విన్' పరిష్కారం. కానీ కాంగ్రెస్, దాని విపక్ష కూటమి పట్టుదలకు పోయి వాకౌట్ చేయడంతో, మూడింట రెండొంతుల ప్రత్యేక మెజారిటీ లేక బిల్లు ఆగిపోయింది.

ఈ ఓటమిపై దేశవ్యాప్తంగా పెద్దఎత్తున చర్చ జరిగింది. విపక్షాల బాధ్యతారాహిత్య చర్య వల్ల దక్షిణాది సాధించింది ఏమీ లేదనే సత్యం ప్రజలకు అర్థమైంది. బహిరంగంగా దక్షిణాది ప్రయోజనాల గురించి మాట్లాడే కాంగ్రెస్, డీఎంకే వంటి పార్టీలు రాజకీయంగా మాత్రం దక్షిణాదిని రక్షించే ఏకైక నిర్మాణ వ్యవస్థను ధ్వంసం చేయడం.. వారి అంతర్గత వైరుధ్యాన్ని బయటపెట్టింది. కేవలం గుడ్డి వ్యతిరేకతతో, దేశ ప్రయోజనాలను, ముఖ్యంగా దక్షిణాది ప్రయోజనాలను, పణంగా పెట్టడానికి కూడా కాంగ్రెస్ వెనుకాడటం లేదు. దీనికి భిన్నంగా తెలుగుదేశం పార్టీ మొదటి నుంచీ ఈ బిల్లుకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ, ప్రాంతీయ ప్రయోజనాలతో పాటు జాతీయ సమగ్రతను కాపాడేలా అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరి ంచింది. గత సమావేశాల ఓటమినీ, తదనంతర పరిణా మాలను నేపథ్యంగా ఉంచుకుని, ప్రస్తుత పార్లమెంట్ సమావేశాలు కేవలం ఆర్థిక కేటాయింపులకే పరిమితం కాకుండా, దేశ సమాఖ్య స్ఫూర్తిని రక్షించే డీలిమిటేషన్ సవరణపై పునఃచర్చకు వేదిక కావాలి. విపక్షాలు తమ పాత పంతాలను పక్కనబెట్టి, జాతీయ సమ్మతిని సాధించడానికి ముందుకు రావాలి. ఈ సెషన్‌లో ప్రధానంగా మూడు అంశాలపై ఉభయసభల్లో చర్చ జరగాలని తెలుగుదేశం పార్టీ కోరుకుంటోంది. ఒకటి, 50శాతం ప్రొపోర్షనల్ సీట్ల పెంపుదలను రాజ్యాంగ సవరణ బిల్లులో అంతర్భాగంగా చేర్చి, దక్షిణాది రాష్ట్రాల జాతీయ ప్రాతినిధ్య శాతం తగ్గదని చట్టబద్ధమైన గ్యారెంటీ ఇవ్వడం. రెండు, నియోజకవర్గాల సంఖ్య పెరగడం వల్ల ప్రతి ఎంపీ పరిధిలోని జనాభా భారం తగ్గి, ప్రజలకు-- ప్రజాప్రతినిధికి మధ్య దూరం తగ్గడం. మూడు, 2023లో ఆమోదించిన 'నారీ శక్తి వందన్ అధినియం' అమలు కావాలంటే చట్టసభల్లో 33శాతం స్థానాలు మహిళలకు దక్కాలంటే, డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తి కావడం సాంకేతికంగా అత్యంత అవసరం. ఈ బిల్లును అడ్డుకోవడం అంటే మహిళల చట్టసభల హక్కును కాలరాయడమే. ప్రొపోర్షనల్ సీట్ల పెంపు మోడల్ ఫెడరల్ వ్యవస్థకు రక్షణ కవచం. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు ఇప్పటికైనా సంకుచిత పంథాను మార్చుకొని, దక్షిణాది ప్రయోజనాల రక్షణ కోసం, మహిళా సాధికారత కోసం ఈ పార్లమెంటు సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లుకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలి. ఈ సమావేశాలలోనే దీన్ని అనుబంధ బిల్లు రూపంలో ఎజెండాలోకి తెచ్చి ఆమోదింప జేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా పాటించాలి

**-హియరింగ్ కేసుల పరిష్కారంపై వేగం పెంచాలి**
**-ఎన్నికల పరిశీలకురాలు ప్రశాంతి ఐఏఎస్**
**-జిల్లాలో సమర్థవంతంగా సర్ ప్రక్రియ జరుగుతుంది**
**-క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి,**
**-జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా**





నంద్యాల, ఆగస్టు 26 వార్త సాక్ష్యం

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సర్ – 2026) ప్రక్రియలో ప్రతి దశలోనూ పారదర్శకత, జవాబుదారీతనాన్ని పాటిస్తూ, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఓటర్ల జాబితా ప్యూరిఫికేషన్ మరియు ఇతర ఎన్నికల విధులను పకడ్బందీగా పూర్తి చేయాలని ఎన్నికల పరిశీల కురాలు ప్రశాంతి ఐఏఎస్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్లోనే వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, డి ఆర్ ఓ రాము నాయక్, వీఆర్వోలు, ఏ ఈ ఆర్ ల తో సమగ్ర ఓటర్ల జాబితా సవరణ పై ఎన్నికల పరిశీలకురాలు ప్రశాంతి ఐఏఎస్ సమీక్షించారు.ఎన్నికల విధుల పరిశీలనలో భాగంగా బీఎల్ఓల పనితీరు, ఓటర్ల జాబితా సవరణ, ఫారమ్ల పరిష్కారం, నోటీసుల విచారణ తదితర అంశాలపై ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు. అనంతరం ఎన్నికల పరిశీలకురాలు మాట్లాడుతూ.. క్షేత్రస్థాయి పరిశీలనలో బీఎల్ఓలు తమ విధులపై స్పష్టమైన అవగాహనతో, అవసరమైన ఆధారాలు మరియు పత్రాలను సక్రమంగా సేకరిస్తూ సమర్థవం తంగా పనిచేశారని తెలిపారు. రాజకీయ పార్టీలు లేవనెత్తుతున్న ప్రశ్నలు, సందేహాలను నివృత్తి చేయడంలో బీఎల్ఓలు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు.జిల్లా కలెక్టర్ రాష్ట్ర స్థాయి మాస్టర్ ట్రైనర్గా పనిచేసిన అనుభవాన్ని వినియోగిస్తూ సిబ్బందికి నాణ్యమైన శిక్షణ అందిస్తున్నారని తెలిపారు. ప్రణాళిక, శిక్షణ అంశాలను కలెక్టర్ మార్గదర్శ కత్వంలో సమర్థవంతంగా నిర్వహిస్తూ, క్షేత్రస్థాయిలో వాటిని పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. మరణించిన వారి పేర్లను ఏఎస్డీ జాబితా నుంచి తొలగించే సమయంలో రాజకీయ పార్టీలతో స్పష్టమైన కమ్యూనికేషన్ కొనసాగించాలని తెలిపారు. డెత్ సర్టిఫికెట్, కుటుంబ సభ్యుల డిక్లరేషన్, అవసరమైన సందర్భాల్లో వీఆర్వో సమక్షంలో పంచనామా వంటి ఆధారాలను పరిశీలించిన అనంతరమే తొలగింపు ప్రక్రియ చేపట్టాన్నారు. గతంతో పోలిస్తే ఫారమ్-7 ద్వారా పేర్ల తొలగిం పునకు వచ్చే అభ్యర్థనలు తగ్గడం బీఎల్ఓలు ఏఎస్డీ జాబితా ఆధారంగా మరణించిన ఓటర్లను ముందుగానే గుర్తించి, ఓటర్ల జాబితాను సమర్థవం తంగా ప్యూరిఫికేషన్ చేస్తున్నారనడానికి నిదర్శనమని అన్నారు.రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించే వారపు సమావేశాలను కేవలం తహసీల్దార్ల స్థాయిలో కాకుండా ఈఆర్ఓలు కూడా భాగస్వామ్యం కావాలన్నారు. నో-మ్యాపింగ్, లాజికల్ ఎర్రర్స్కు సంబంధించిన కేసులను ప్రత్యేకంగా షెడ్యూల్ చేసి, నిర్ణీత 24 నుంచి 48 గంటల వ్యవధిలో కలెక్టర్ లాగిన్కు పంపాలని అధికారులను ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా జారీ చేసిన నోటీసు లకు సంబంధించి హియరింగ్స్ ను త్వరితగతిన పూర్తి చేసి, పెండింగ్ లో ఉన్న క్లెయిమ్స్ను నిబంధనల ప్రకారం పరిశీలించి వేగంగా డిస్పోజల్ చేయాలని సూచించారు.ఎన్నికల ప్రక్రియలో ప్రతి దశలోని పారదర్శకంగా ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఓటర్ల జాబితా ప్యూరికేషన్, ఎన్నికల విధులను పగడ్బందీగా పూర్తి చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్ ) ప్రక్రియ భారత ఎన్నికల సంఘం సూచించిన సవరించిన షెడ్యూల్ ప్రకారం వేగంగా కొనసాగుతోందనీ ఎన్నికల పరిశీలకురాలకు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా, ఓటర్ల జాబితాను పారదర్శకంగా, నిష్పాక్షికంగా శుద్ధి చేసేందుకు జిల్లా ఎన్నికల యంత్రాంగం చర్యలు చేపడుతోందన్నారు. ఎన్యూమ రేషన్ ఫారాల పంపిణీ 100 శాతం పూర్తయిం దన్నారు. సర్ ప్రక్రియలో భాగంగా మ్యాపింగ్ కాని 6,066 మంది, లాజికల్ డిస్క్రెపెన్సీస్ ఉన్న 74,217 మంది కలిపి మొత్తం 80,283 మంది ఓటర్లకు 100 శాతం నోటీసులు జారీ చేసి పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఇప్పటివరకు 36,382 హియరింగ్స్ నిర్వహించి, సంబంధిత ఆధారాలను సేకరించామని అన్నారు. ప్రస్తుతం ప్రతి కేసుకు సంబంధించి బి ఎల్ ఓ నివేదికతో పాటు ఎన్నికల సంఘం సూచించిన 13 రకాల ప్రామాణిక పత్రాలలో ఏదో ఒకదానిని సేకరించి విచారణలను త్వరితగతిన పూర్తి చేయడం పై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. పెండింగ్లో ఉన్న ఫారమ్-6 ఫారమ్-7లో ఫారమ్-8 దరఖాస్తులను నిర్ణీత గడువులోగా నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ ఈనెల 30, తేదీ వరకు ఉన్నట్లు తెలిపారు,అభ్యంతరాల పరిష్కారం చివరి సెప్టెంబర్ 28

**-తుది ఓటర్ల జాబితా ప్రచురణ అక్టోబర్ 3**

ఈ ఆర్ ఓ లు, ఏఈఆర్ఓ లు, బి ఎల్ ఓ లు సమన్వయంతో పనిచేస్తూ క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేస్తామన్నారు. ఓటర్ల జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఉండేలా చూడడంతో పాటు, అనర్హులు అయిన మరియు డూప్లికేట్ నమోదులను నిబంధనల ప్రకారం గుర్తించి సరిచేసేలా చర్యలు తీసుకుంటున్నారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా సర్ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పాక్షికంగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేయడమే లక్ష్యంగా జిల్లా ఎన్నికల యంత్రాంగం పనిచేస్తోందన్నారు.

# సర్ ప్రక్రియపై రాజకీయ పార్టీ ప్రతినిధులతో ఎన్నికల పరిశీలకురాలు సమావేశం- ప్రశాంతి ఐఏఎస్





నంద్యాల, ఆగస్టు 26 వార్త సాక్ష్యం

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ సర్ ప్రక్రియలో భాగంగా ఎన్నికల పరిశీలకురాలు, పి. ప్రశాంతి, ఐఏఎస్ , డైరెక్టర్ , రెహబిలిటేషన్ & రీసెటిల్మెంట్ , ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల పరిశీలకురాలు మాట్లాడుతూ సర్ ఓటర్ల జాబితా ప్రక్రియపై నోటీసుల విచారణ, క్లెయిమ్స్, అభ్యం తరాల స్వీకరణ, తుది ఓటర్ల జాబితా రూప కల్పన తదితర అంశాలపై చర్చించారు. నోటీసుల విచారణ సమయంలో సంబంధిత ఓటర్ల నుంచి అవసరమైన పత్రాలు, ఆధారాలను సేకరించి, విచారణ ప్రక్రియలో భాగంగా పరిశీలించాలని తెలిపారు. క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణకు గడువు ఈనెల 30వరకు ఉన్నందున, రాజకీయ పార్టీ ప్రతినిధులు తమ పరిధిలోని ఓటర్లకు ఈ విషయాన్ని తెలియజేసి, అవసరమైన క్లెయిమ్స్, అభ్యంతరాలను సంబంధిత ఎన్నికల నమోదు అధికారి లకు సకాలంలో అందించేలా అవగాహన కల్పించాలన్నారు. అర్హత కలిగిన ఓటర్ల పేర్లు తుది ఓటర్ల జాబితాలో చేర్చేలా, గడువులోగా అందే క్లెయిమ్స్, అభ్యంతరాలను నిబంధనల ప్రకారం పరిశీలించాలన్నారు. సర్ --2026 ప్రక్రియలో నోటీసుల విచారణ, క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కారం తదితర అన్ని దశల్లో ఎన్నికల యంత్రాం గానికి రాజకీయ పార్టీలు పూర్తి సహకారం, సమన్వయం అందించాలని ఎన్నికల పరిశీలకురాలు కోరారు.ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొని సర్ --2026 ప్రక్రియకు సంబంధించి తమ అభిప్రాయాలను తెలియజేశారు

# నంద్యాల జిల్లాకు రెగ్యులర్ సాంఘిక సంక్షేమ శాఖ అధికారి డిటిడబ్ల్యూఓని నియమించాలి

**-గిరిజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు జవహర్ నాయక్**

ఆత్మకూరు ఆగస్టు 26 వార్త సాక్ష్యం

నంద్యాల జిల్లాకు రెగ్యులర్ సాంఘిక సంక్షేమ శాఖ అధికారిని నియమించాలని గిరిజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు జవహర్ నాయక్ ప్రభుత్వాన్ని కోరారు.బుధవారం నాడు ఆత్మకూరు పట్టణంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ పాఠశాలల పర్యవేక్షణ లేక, కొన్ని ఆశ్రమ పాఠశా లల్లో సబ్జెక్టు ఉపాధ్యాయులు లేక గిరిజన విద్య కుంటు పడిందని, ఉపాధ్యాయుల అక్రమ డిప్యూ టేషన్ లు వెంటనే రద్దు చేయాలని, ఇన్చార్జి అధికారి దివ్యాంగుడు కావడంతో అతని తమ్ముడి పెత్తనంతో పలు అక్రమాలు జరుగు తున్నాయని,గత ఇరబై సంవత్సరాల నుంచి ఇక్కడే పనిచేయడంతో అనేక అవకతవకలు జరుగుతు న్నాయని, బోగస్ సర్టిఫికెట ్లతో చాలామంది ఉద్యోగంలో చేరుతున్నారని అతనిని వెంటనే బదిలీ చేసి నంద్యాల జిల్లాకు రెగ్యులర్ గిరిజన సాంఘీక సంక్షేమ శాఖ అధికారిని నియమిం చాలని, గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేటట్లు చూడాలని అధికారులను ఆయన కోరారు.



**జవహర్ నాయక్ గిరిజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు.**

## ఆత్మకూరులో ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు



ఆత్మకూరు ఆగస్టు 26 వార్త సాక్ష్యం

పట్టణంలోని ఆసార్ మసీదులో మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఘనంగా బుధవారం నిర్వహించారు. ప్రతి సంవత్సరం నిర్వహించే ఈ వేడుకలను ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.ఈ సందర్భంగా ఆసార్ మసీదును ప్రత్యేకంగా అలంకరించారు. ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరిం చుకుని ఆయన బోధనలు, సందేశాలను స్మరించుకున్నారు. వేడుకల సందర్భంగా మత పెద్దలు శాంతి, సోదరభావం, ఐక్యత, మానవతా విలువల ప్రాధాన్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మిలాద్ ఉన్ నబీ వేడుకల కార్యక్రమంలో మౌలానా మహమ్మద్ గౌస్, ఆసార్ మాలిక్, బట్టల సుల్తాన్,ఫ్రూట్ కరీముల్లా, అమ్రుల్లా, లాలు, మాజీ కౌన్సిలర్ కలిముల్లా, హబీబ్, సయ్యద్ గౌస్, అశ్వక్, ఇర్ఫాన్, మహమ్మద్ రఫీ, పాల్గొన్నారు.

## సాగర్ కుడి కాలువకు తాగునీరు



గురజాల

నాగార్జునసాగర్ కుడి కాలువ ద్వారా ఐదు జిల్లాల తాగునీటి అవసరాల నిమిత్తం అధికారులు బుధవారం ఉదయం నీటిని విడుదల చేశారు. తాగునీటి ఎద్దడిని నివారించేందుకు సుమారు 8 టీఎంసీల నీటిని కేటాయించినట్లు అధికారులు తెలిపారు.ఈ నీటిని కేవలం తాగునీటి అవసరాలకే వినియోగించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ పంటల సాగుకు మళ్లించరాదని స్పష్టం చేశారు. నీటి అక్రమ మళ్లింపును అరికట్టేందుకు కాలువలపై ప్రత్యేక గస్తీ బృందాలను ఏర్పాటు చేశారు. అలాగే కాలువలపై అనధికారికంగా ఏర్పాటు చేసిన మోటార్లు, పంపులను తొలగించే చర్యలు చేపట్టారు.తాగునీటి అవసరాలకు కేటాయించిన నీటిని పంటలకు మళ్లిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

## గొట్టిముక్కలలో వీల్చైర్లు పంపిణీ



గురజాల

గురజాల మండలం గొట్టిముక్కల గ్రామంలో వికలాంగులు, బాధితులకు వీల్చైర్లు, ట్రైసైకిళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 'అడుగుబాటలో' కార్యక్రమంలో భాగంగా ఈ సహాయక పరికరాలను అందజేశారు.ఇటీవల రోడ్డు ప్రమాదాల్లో గాయపడి నడవలేని స్థితిలో ఉన్నవారితో పాటు పోలియో, పక్షవాతం బారిన పడిన బాధితులకు వీల్చైర్లు, ట్రైసైకిళ్లు అందించారు. దీంతో బాధితులకు కొంతమేర ఉపశమనం కలిగిందని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రొండి సాంబయ్య, రావిపాటి రవికుమార్, రొండి పోలు రాజు, బోజవతు నరసింహ నాయక్, కటికల అక్కులు, బొల్లం నాగరాజు, అమర్ నాయక్, జిల్లాబోయన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామ నాయకులు మాట్లాడుతూ గొట్టిముక్కల గ్రామ ప్రజలు తమ సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. సమస్యలను ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లి, వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# ప్రజల నమ్మకమే మా బలం

-ఎమ్మెల్యే ఏలూరు సాంబశివరావు



మార్టూరు

మార్టూరు, వలపర్ల గ్రామాల్లో నిర్వహించిన 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమంలో పర్చూరు ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.గత రెండేళ్లుగా ప్రజల నమ్మకాన్ని నిలబెట్టు కుంటూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేరవేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల ఆశీస్సులు, నమ్మకమే తమకు బలమని పేర్కొంటూ, పర్చూరు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# మాజీ సైనికుడికి ఘన నివాళులు



బాపట్ల

బాపట్ల పట్టణంలోని నరాలసెట్టిపాలెం కోర్టు ప్రాంతంలో స్వర్గీయ మాజీ సైనికుడు గంపాల సుబ్బారెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమం సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తాంద్ర సాంబశివరావు హాజరై సుబ్బారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ఈ సందర్భంగా తాంద్ర సాంబశివరావు, ఉమ్మడి గుంటూరు జిల్లా సైనిక్ వెల్ఫేర్ కార్యాలయ సూపరింటెండెంట్ ఆనందరావు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మాజీ సైనికుడు గంపాల సుబ్బారెడ్డిని స్మరించుకుంటూ కుటుంబ సభ్యులు ప్రథమ వర్ధంతిని ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు.సుబ్బారెడ్డి స్థానంలో ఎస్‌బీఐలో ఉద్యోగం పొందిన ఆయన కుమార్తె షాలిని రెడ్డిని రాష్ట్ర అధ్యక్షులు అభినందించారు. ఇంజనీరింగ్ చదువుతున్న కుమారుడు తరుణ్ రెడ్డి కుటుంబ బాధ్యతలను దృష్టిలో ఉంచుకుని ముందుకు సాగాలని సూచించారు.కార్యక్రమంలో బాపట్ల అసోసియేషన్ అధ్యక్షులు పుట్టా ఆదిశేషా రెడ్డి, ఉపాధ్యక్షులు చలికొండ వెంకట కృష్ణారావు, జాయింట్ సెక్రెటరీ పీటా సారధి, జిల్లా అసోసియేషన్ ఉపాధ్యక్షులు బాలా శివా రెడ్డి, సీనియర్ మాజీ సైనికులు దూళ్ళ వెంకటేశ్వర్లు, బక్కా రామకృష్ణారెడ్డి, వూడా నాగరాజు, సింగా రెడ్డి, ఆట్ల శివ కేశవరెడ్డి, నంగనం నాగరాజు, నలాడి దాస్ తదితరులు పాల్గొన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా సైనిక్ వెల్ఫేర్ కార్యాలయ సిబ్బంది ఆనందరావు, రాజేష్, వెంకట రాజేష్, శ్రీకాంత్ తదితరులు హాజరయ్యారు.

# స్ఫూర్తి కార్యక్రమానికి ఆహ్వాన పత్రికలు




చీరాల

చీరాల పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఈ నెల 30న విజయవాడలో నిర్వహించనున్న సంచార, అర్ధసంచార, విముక్తి జాతుల స్ఫూర్తి విముక్తి దినోత్సవ కార్యక్రమం ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు.బాపట్ల జిల్లా బీజేపీ అధ్యక్షులు మువ్వల వెంకటరమణారావు అధ్యక్షతన, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు డాక్టర్ తాడివలస దేవరాజు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మువ్వల వెంకటరమణారావు మాట్లాడుతూ డి.ఎన్.టీ., ఎన్.టీ. జాతుల అభివృద్ధి, సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. వారి హక్కులు, గుర్తింపు, సంక్షేమం కోసం బీజేపీ కృషి చేస్తోందని తెలిపారు. డాక్టర్ తాడివలస దేవరాజు మాట్లాడుతూ సంచార, అర్ధసంచార, విముక్తి జాతులు దేశ చరిత్రలో కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు. వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.ఈ నెల 30న విజయవాడలో జరిగే స్ఫూర్తి కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ, ఓబీసీ మోర్చా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# డోన్ పట్టణంలో సెప్టెంబర్ 2న చండీ హోమం





-ధార్మిక సంస్థల సమ్మేళనని విజయవంతం చేయండి

నంద్యాల ఆగస్టు 26 వార్త సాక్ష్యం

డోన్ పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సెప్టెంబర్ 2న ఉదయం 9: గంటల నుండి విశ్వ శ్రేయస్సును కాంక్షిస్తూ ప్రముఖ యాజ్ఞికులు బ్రహ్మశ్రీ సోమయాజులు నేతృత్వంలో చండీహోమం, ధార్మిక సంస్థల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు పాతాళం సుబ్బారావు తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్యానరు, కరపత్రాలను డోన్ పట్టణంలోని వివిధ ధార్మిక సంస్థల ప్రతినిధులతో కలిసి ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలాంధ్ర సాధుపరిషత్ అధ్యక్షులు శ్రీశ్రీశ్రీ ఆచార్య పరమాత్మానందగిరి స్వామీజీ, శ్రీశ్రీశ్రీ విరజానందస్వామీజీలతో పాటు వివిధ ధార్మిక సంస్థల ప్రతినిధులు, ఆశ్రమా పీఠాధిపతులు, సనాతన హిందూ ధార్మిక జాగృతిని కలిగించేలా ధార్మిక పరిరక్షణకు పునరంకితమయ్యేలా ప్రేరణాత్మక ఉపన్యాసాలను, అనుగ్రహ భాషణాలను చేస్తారని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి తెలిపారు. ఈ సన్నాహక కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు సందు రమణ, కృష్ణారావు, తిమ్మారెడ్డి, ఒ. కిరణ్, శ్రీరామ్, శ్రీ వివేకానంద సేవాసమతి వ్యవస్థాపక అధ్యక్షులు జగన్మోహన్, కార్యదర్శి జొన్నగడ్డ శ్రీనివాసులు శెట్టి, సలహా సభ్యులు సర్వజ్ఞ మూర్తి, తిరుమల తిరుపతి దేవస్థాన ములు జిల్లా ధర్మ ప్రచార మండలి సభ్యులు శ్రీనివా సులు, డాక్టర్ సురేశ్ బాబు, శ్రీకృష్ణ భగవద్గీత పరివార్ కార్యదర్శి ఎల్కూరి నరేష్, గీతా యోగాసన సంఘం గురువు శ్రీ రాం పుల్లయ్య, రామకృష్ణ, రోటరీ క్లబ్ ఆఫ్ డోన్ అధ్యక్షులు గంగిరెడ్డి మరియు వివిధ ధార్మిక సంస్థల ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

# ముంపు గ్రామాల్లో మూగబోయిన పల్లె జీవనం





-సుంకేసుల, కలనూతల, గుండంచర్ల గ్రామాల్లో విషాద ఛాయలు

-పరిహారం కోసం ఎదురుచూపులు, పుట్టిన ఊరును వదిలి వెళ్లే వేదన,రోదన

దోర్నాల ఆగస్టు 26 వార్త సాక్ష్యం

చిరకాల స్నేహాలు చెల్లాచెదురవుతున్నాయి. ఎవరు ఎటు ప్రయాణమో తెలియని పరిస్థితి నెలకొందని కోడి మోహన్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. అన్నదమ్ముల బంధాలు సైతం పరిహారం, పునరావాస సమస్యలతో విడిపోతున్నాయి. ఒకప్పుడు ప్రజల సందడితో కళకళలాడిన పల్లెల్లో ఇప్పుడు మౌనం అలుముకుంది. వెలుగొండ ప్రాజెక్టు ముంపు ప్రభావిత గ్రామాలైన సుంకేసుల, కలనూతల, గుండంచర్ల గ్రామాల్లో కనిపిస్తున్న దృశ్యాలు స్థానికుల హృదయాలను కలచివేస్తున్నాయి. తరతరాలుగా సాగిన జీవన విధానం, బంధుత్వాలు, ఆచార వ్యవహా రాలు, పండుగలు, పల్లె సంస్కృతి అన్నీ ఒక్కొక్కటిగా కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది. గొల్ల కురుమల మందలు ఒకే దారిలో మేతకు వెళ్లిన రోజులు గుర్తుకొస్తున్నాయి. మాదిగల డప్పుల మోతతో పల్లెల్లో పండుగ వాతావరణం నెలకొన్న కాలం గతమవుతోంది. కాడెద్దుల రంకెలు, పశువుల కొట్టాల సందడి, పిల్లల ఆటలు, రైతుల పొలాల బాటలు ఇప్పుడు జ్ఞాపకాలుగా మిగిలే పరిస్థితి ఏర్పడింది. సాంప్రదాయ పండుగలు, సకినాలు, గ్రామ దేవతల జాతరలు, కుటుంబ వేడుకలు పల్లె ప్రజలందరినీ ఒకచోట చేర్చేవి. కానీ గ్రామాలు ఖాళీ అవుతున్న కొద్దీ ఆ సామూహిక జీవన విధానం కూడా దూరమవుతోంది. బడిలో మోగే గంటలు, గుడిలో వినిపించే మేళాలు, బసవన్న గంటల శబ్దాలు క్రమంగా మూగబోతున్నాయనే ఆవేదన గ్రామస్తుల్లో వ్యక్తమవుతోంది.తమ పూర్వీకులు నివసించిన ఇళ్లు, ఆ ఇళ్ల ముందు ఉన్న చెట్లు, చిన్ననాటి జ్ఞాపకాలు, పొలాలు, చెరువులు, దేవాలయాలు, బంధువుల ఇళ్లు---ఇవన్నీ వదిలి కొత్త ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి రావడం ముంపు గ్రామాల ప్రజలకు కన్నీటి ప్రయాణంగా మారింది. పునరావాసం, పరిహారం, కొత్త నివాస ప్రాంతాల్లో మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలు వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు. కేవలం ఇళ్లు, భూములకు పరిహారం ఇవ్వడం మాత్రమే కాకుండా, తరతరాలుగా కొనసాగిన సామాజిక బంధాలు, పల్లె సంస్కృతి, జీవనోపాధి కోల్పోతున్న ప్రజలకు సమగ్ర పునరావాసం కల్పించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



సుంకేసుల, కలనూతల, గుండంచర్ల గ్రామాల పరిస్థితి ఒక ప్రశ్నను ముందుకు తెస్తోంది--- అభివృద్ధి కోసం ఒక గ్రామాన్ని కోల్పోతే, ఆ గ్రామ ప్రజల జ్ఞాపకాలు, బంధాలు, సంస్కృతికి విలువ ఎవరు నిర్ణయి స్తారు?నిన్నటి వరకు పండుగలతో కళకళలాడిన పల్లెలు రేపటి నుంచి జ్ఞాపకాలుగా మిగిలిపోనున్న వేళ, ముంపు గ్రామస్తుల కన్నీటి ప్రయాణానికి న్యాయం చేసేలా ప్రభుత్వం సమగ్ర పరిహారం, పునరావాసం, పునరావాస గ్రామాల్లో మెరుగైన జీవన సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందని కోడి మోహన్ రావు తెలియజేశారు.

# శ్రీశైలం దేవస్థానంలో హుండీల లెక్కింపు





శ్రీశైలం ఆగస్టు 26 వార్త సాక్ష్యం

శ్రీశైలం దేవస్థానంలో బుధవారం జరిగిన హుండీల లెక్కింపు ద్వారా దేవస్థానానికి రూ. 5,88,89, 846/-లు నగదు రాబడిగా లభించింది. ఈ హుండీల రాబడిని భక్తులు గత 35 రోజులలో గత నెల 22 నుంచి ఈనెల 26వ తేదీ వరకు ఈ హుండీలో 87 గ్రాముల 200 మిల్లీగ్రాముల బంగారు, 4 కేజీల 250 గ్రాముల వెండి లభించాయి. అదేవిధంగా 540 - యుఎస్ఏ డాలర్లు, 1610,యు.ఏ.ఇ దిర్హమ్స్, 20 - సింగపూర్ డాలర్లు, 140 ఇంగ్లాండు పౌండ్స్, 21 మలేషియా రింగిట్స్, 10 సౌదీరియాల్స్, 109,బహ్రైన్ దినార్, 100, ఓమన్ బైసా, 5 ఓమన్ రియాల్స్ మొదలైనవి ఈ హుండీల లెక్కింపులో పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య సీసీ కెమెరాల నిఘాతో ఈ లెక్కింపును చేపట్టడం జరిగింది. ఈ హుండీల లెక్కింపును ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్‌నాయుడు, కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు , ధర్మకర్తల మండలి సభ్యులు, కె. కాంతివర్ధిని, ఉప్పుటూరి సుబ్బలక్ష్మి, . పి.యు. శివమ్మ పర్యవేక్షించారు. అదేవిధంగా హుండీల లెక్కింపులో పలువిభాగాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు, దేవస్థానం సిబ్బంది శివసేవకులు పాల్గొన్నారు



VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# శ్రీశైలంలో సాక్షి గణపతి స్వామికి విశేష అభిషేకం

శ్రీశైలం ఆగస్టు 26 వార్త సాక్ష్యం

శ్రీశైలం పుణ్యక్షేత్రంలో సాక్షిగణపతిస్వామి కి విశేష అభిషేకాన్ని నిర్వహించారుప్రతి బుధవారం, సంకటహరచ వితిరోజు మరియు పౌర్ణమిరోజులలో సాక్షిగణపతి కి ఈ విశేషఅభిషేకం నిర్వహిస్తారు. సాక్షి గణపతి స్వామివారికి పంచామృతాలతోనూ, పలుఫలోదకాలతోనూ, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలంతో అభిషేకం నిర్వహించబడింది. తరువాత స్వామివారికి విశేషపు ష్పార్చన, నివేదన కార్యక్రమాలు జరిపించారు. వైదిక సంప్రదాయాలలో గణపతి అభిషేకానికి ఎంతో ప్రాముఖ్యం ఉంది. ఈ గణపతి అభిషేకం వలన అనుకున్న పనులలో ఆటంకాలు తొలగి విజయం లభిస్తుందని చెప్పబడుతోంది. అలాగే కోరిన కోరికలు నెరవేరుతాయని, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు కలుగుతాయని, ముఖ్యంగా విద్యార్థులలో ఆలోచనా శక్తి పెరిగి విద్య బాగా వస్తుందని చెప్పబడుతోంది. శ్రీశైలక్షేత్ర పరివార ఆలయాలలో సాక్షి గణపతి ఎంతో విశిష్టత ఉంది. భక్తులు శ్రీశైల మహా క్షేత్రాన్ని సందర్శించినట్లుగా కైలాసంలో పరమేశ్వరుని



వద్ద ఈ స్వామి సాక్ష్యం చెబుతాడని ప్రసిద్ధి. అందుకే ఈ స్వామి సాక్షిగణపతిగా పేరొందాడు. చక్కని నల్లరాతితో మలచబడిన ఈ స్వామి ఒకచేతిలో కలం,



మరోచేతిలో పుస్తకాన్ని ధరించి భక్తుల పేర్లను నమోదు చేస్తున్నట్లుగా దర్శనమిస్తాడు

# పేకాట స్థావరం పై పెదవేగి పోలీస్ ల మెరుపు దాడి

పెదవేగి ఆగస్టు 26 వార్త సాక్ష్యం



వారికి అందిన సమాచారం మేరకు అమ్మపాలెం ప్రాంతంలో తనిఖీలు నిర్వహించి, చట్టవిరుద్ధంగా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై దాడి చేశారు. ఈ దాడిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుండి రూ. 45,170/- నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై పెదవేగి పోలీస్ స్టేషన్‌లో 9(1) జూదం చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హరి గోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా పెదవేగి ఎస్ఐ హరి గోపాల్ మాట్లాడుతూ మండలంలో జూదం, పేకాట లేదా ఇతర అసాంఘిక కార్యక్రమాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని స్పష్టం చేశారు. అసాంఘిక కార్యకలాపాల నిర్వాహకులు, వాటికి పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగు తుందని హెచ్చరించారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు, అసాంఘిక కార్యకలాపాల అణచివేతకు పోలీసు లు డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా మరింత కఠినతరం చేస్తామని ఆయన పేర్కొన్నారు.

# భక్తిశ్రద్ధలతో పట్టణంలో మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు





ఆత్మకూరు ఆగస్టు 26 వార్తసాక్ష్యం

పట్టణంలోని సంత మార్కెట్ సమీపంలో ఉన్న ఆసర్ మసీదులో మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహమ్మద్ ప్రవక్త పవిత్ర కేశ దర్శనం చేసుకునే భాగ్యాన్ని పట్టణ ప్రజలకు కల్పించారు. ఈ పవిత్ర కార్యక్రమానికి ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక ప్రార్థనలు, బోధనలు నిర్వహించారు. మహమ్మద్ ప్రవక్తను స్మరించు కుంటూ భక్తిశ్రద్ధలతో వేడుకల్లో పాల్గొన్నారు. మహమ్మద్ ప్రవక్త సూచించిన శాంతి మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని, అప్పుడే మానవుని జీవితం సార్థకమవుతుందని మౌలానా మహమ్మద్ గౌస్ ప్రజలకు తెలిపారు. మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని పట్టణ ప్రజలకు ఆసర్ మసీదులో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమం ఆసార్ మసీదు ముత్తవల్లి హాజీ ఆసార్ రహమతుల్లా ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. కార్యక్రమంలో ఆసార్ మాలిక్ హాజీ సుల్తాన్, , పండ్ల మాలిక్, పండ్ల కలిముల్లా, లాలు, అమ్ముల్లా, తదితరులు పాల్గొన్నారు.

# 23 రోజుల ఉత్కంఠకు తెర

**-23 రోజుల తర్వాత క్షేమంగా లభ్యమైన ఏడుగురు మత్స్యకారులు ఆచూకీ**

**-ఆనందం వ్యక్తం చేసిన మంత్రి వాసంశెట్టి సుభాష్**

రామచంద్రపురం/ అమరావతి ఆగస్టు 26 వార్త సాక్ష్యం



డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన మత్స్యకారులు క్షేమంగా ఉన్నారన్న సమాచారం అందడంతో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ హర్షం వ్యక్తం చేశారు. అల్లవరం మండలం ఓడలరేవు నుంచి ఈ నెల 3వ తేదీన వేటకు వెళ్లి గల్లంతైన బోటు ఆచూకీ లభించడంతో పాటు, అందులో ఉన్న ఏడుగురు మత్స్యకారులు సురక్షితంగా ఒడిశాలోని పారాదీప్ తీరానికి చేరుకున్నారని అధికారులు ధృవీకరించినట్లు మంత్రి తెలిపారు. గత 23 రోజులుగా మత్స్యకారుల ఆచూకీ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాలు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టాయని మంత్రి సుభాష్ పేర్కొన్నారు. గల్లంతైన మత్స్యకారుల క్షేమ సమాచారం అందడంతో వారి కుటుంబ సభ్యుల్లో ఆనందం వెల్లివిరిసిందన్నారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటికప్పుడు జిల్లా అధికారులతో సమన్వయం చేస్తూ పరిస్థితిని సమీక్షించారని మంత్రి సుభాష్ వెల్లడించారు. మత్స్యకారుల ఆచూకీ కోసం చేపట్టిన గాలింపు చర్యల్లో పాల్గొన్న అన్ని శాఖల అధికారులకు, సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు. బెంగాల్--ఒడిశా సరిహద్దు ప్రాంతంలో మత్స్యకారుల ఆచూకీ లభించిందని, ఏడుగురు మత్స్యకారులు క్షేమంగా ఉన్నారని సమాచారం అందిన వెంటనే వారిని స్వస్థలాలకు తీసుకురావడానికి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. అవసరమైతే అధికారుల బృందాన్ని పశ్చిమ బెంగాల్, ఒడిశా ప్రాంతాలకు పంపించి మత్స్యకారులను సురక్షితంగా స్వగ్రామాలకు చేర్చేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మత్స్యకారులు క్షేమంగా ఉన్నారన్న సమాచారం మాకు ఎంతో ఊరటనిచ్చింది. గత 23 రోజులుగా ఆందోళనలో ఉన్న కుటుంబ సభ్యులకు ఇది సంతోషకరమైన వార్త. ప్రభుత్వం వారి వెంటే నిలబడి, వారిని త్వరితగతిన స్వస్థలాలకు తీసుకువచ్చే బాధ్యతను నిర్వర్తిస్తుంది అని మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు.

# శ్రీశైల పుణ్యక్షేత్రంలో సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీశైలం ఆగస్టు 26 వార్త సాక్ష్యం

శ్రీశైలదేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా నిత్య కళారాధన బుధవారం ఆలయ ప్రాంగణంలో బి.మల్లేశ్వరరావు, అంబేద్కర్ కోనసీమ "శ్రీశైలమాహాత్మ్యం" పై ప్రవచన కార్యక్రమం నిర్వహించరు ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ప్రతి రోజు సాయంకాలం 6 గంటల నుండి ఈ ప్రవచన కార్యక్రమం నిర్వహించే విధంగా ఆలయ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుంటారు రెండవ కార్యక్రమములో కె. ఆరాధ్య మరియు బృందం, బెంగుళూరు వారిచే సంప్రదాయనృత్య ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేసి నిత్య కళారాధనలో ఆయా రోజులలో హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. స్వామి అమ్మవార్లకు కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా నిత్యకళారాధన కార్యక్రమాలు నిర్వహించారు

**-మల్లికార్జున స్వామి భక్తులనుఆకట్టుకున్న**



26.08.2026 కళరాధన 2వ కార్యక్రమం



**భరతనాట్యం**

శ్రీశైల దేవస్థానంలో శ్రావణమాసం సందర్భంగా నిర్వహించిన భరతనాట్యం భక్తులను ఆకట్టుకుంది. బుధవారం బెంగళూరుకు చెందిన నటయాభిరంగా ఇన్స్టిట్యూట్ కు చెందిన కళాకారిణి కుమారి ఆరాధ్య కోగురు శంభో శివ శంభో.. ఓం నమశ్శివాయ తదితర భక్తి గీతాలకు వేసిన నృత్యం ప్రేక్షకులను భక్తాదులను కట్టిపడేసింది.

# నంద్యాల జిల్లా కేంద్రంలో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రత్యేక టెట్ కు సవరణలు చేయాలని ధర్నా విజయవంతం

**-నంద్యాల జిల్లా ఏపీటీఎఫ్ అధ్యక్షుడు ఎం.ఎస్ ఉమ్మర్**

నంద్యాల ఆగస్టు 26 వార్త సాక్ష్యం

రాష్ట్ర ప్రభుత్వం ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల కోసం విడుదల చేసిన ప్రత్యేక టెట్ కు సవరణలు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. మాధవ స్వామి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్. రాఘవరెడ్డి, నంద్యాల జిల్లా అధ్యక్షులు ఎం.ఎస్. ఉమ్మర్, జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు, రాష్ట్ర నాయకులు కె. సాంబశివుడు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారము ఏపీటీఎఫ్ రాష్ట్ర పిలుపుమేరకు నంద్యాల జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదురుగా జిల్లా అధ్యక్షుడు ఎం.ఎస్. ఉమ్మర్ అధ్యక్షతన ధర్నా కార్యక్రమం జయప్రదం చేయడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి విద్య హక్కు చట్టం సెక్షన్ 23 (1 ) ని సవరించి 2010కి ముందు ఉపాధ్యాయ ఉద్యోగంలో చేరిన సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వమునకు ఎన్నిసార్లు ప్రాతినిధ్యాలు చేసిన పట్టించుకోలేదని వారన్నారు. సుప్రీంకోర్టు తీర్పు దరిమిలా సీనియర్ ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ ఏర్పాటుచేసి ఉపాధ్యాయులం దరికీ సమానంగా అర్హత మార్కులు 40 శాతం గా నిర్ణయించాలని అలాగే టెట్ పరీక్షలను ఆన్ లైన్ లో కాకుండా ఆఫ్ లైన్ లో నిర్వహించాలని, గణితం , సైన్స్ ఉపాధ్యాయులకు బోధించే సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నలు మాత్రమే పరీక్షలలో ఇచ్చేలా సిలబస్ లో మార్పు చేయాలని, ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ ను డిసెంబర్ నెలలో నిర్వహించాలని తదితర డిమాండ్లను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు అనేక పర్యాయాలు రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించినప్పటికిని సమస్యలపై స్పందించకుండా, ప్రాతినిధ్యాలను పట్టించుకోకుండా ఉపాధ్యాయులపై కక్ష సాధింపు ధోరణిలో ఏకపక్షంగా ప్రత్యేక టెట్ నోటిఫికేషన్ ఇవ్వడం వల్ల ప్రభుత్వం పట్ల సీనియర్ ఉపాధ్యాయులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని వారు అన్నారు. తమిళనాడు ప్రభుత్వం వల్లే ఆంధ్రప్రదేశ్ కూటమి



ప్రభుత్వము కూడా సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్ర ప్రభుత్వానికి పంపి, విద్యాహక్కు చట్టానికి సవరణలు చేయడానికి కృషి చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. కాబట్టి ఇప్పటికైనా ప్రభుత్వము తక్షణమే స్పందించి ఉపాధ్యాయుల, ఉపాధ్యాయ సంఘాల ప్రాతినిధ్యాల మేరకు ప్రత్యేక టెట్ కు సవరణలు చేయాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏపీటీఎఫ్ గాను ఉమ్మడి ఉద్యమాల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో



సీనియర్ నాయకులు అబ్దుల్ వహీద్, కె. రాముడు, పెరుమాళ్ళ దాసు, జిల్లా నాయకులు మల్లెల పుల్లయ్య, జి. లింగమయ్య, కమతం శ్రీనివాసులు, టి. గోపాల్ రావు, ఎం. పవన్ కుమార్, నగిరి వెంకటేశ్వర్లు, ఇ. రామాంజనేయులు, రమణ యాదవ్, కాసిం సాహెబ్, ఎం. ప్రతాపరెడ్డి, ఆంజనేయులు, విజయకుమార్, పోలియా నాయక్, రామ్మూర్తి, అతహ ర్ అలీఖాన్, రాంప్రసాదు, పరమేశ్వరుడు, వెంకట రమణ, నాగలింగం, శేఖర్ , సురేష్ ,చిన్న వెంకటేశ్వర్లు, మాధవరెడ్డి, చిన్న కృష్ణయ్య, సాంబశివారెడ్డి, నజీర్, బాలకృష్ణ, గురునాథం తదితరులు పాల్గొన్నారు

# బిజినెస్

## హెచ్ఐవీ నివారణ ఇంజెక్షన్ తయారీకి డాక్టర్ రెడ్డీస్‌కు గ్రీన్ సిగ్నల్- భారీగా తగ్గనున్న ధర!

హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ప్రముఖ ఫార్మా సంస్థ డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్.. హెచ్ఐవీ వ్యాప్తిని నివారించే "లెనాకాపవిర్" జెనరిక్ ఇంజెక్షన్‌ను భారత్‌లో తయారు చేసి, విక్రయించేందుకు అనుమతి పొందింది. ఈ విషయంలో మూడో దశ క్లినికల్ ట్రయల్స్ నిర్వహించకుండానే ఉత్పత్తికి, మార్కెటిం గ్‌కు కేంద్ర ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థ (సీడీఎస్‌సీవో) నిపుణుల కమిటీ ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో ఇంజెక్షన్ ధర భారీగా తగ్గే అవకాశం ఏర్పడింది. డాక్టర్ రెడ్డీస్‌తో పాటు ఎంక్యూర్ ఫార్మాస్యూటికల్స్‌కు కూడా నిపుణుల కమిటీ ఈ అనుమతిని మంజూరు చేసింది. అయితే, మార్కెట్లోకి విడుదల చేశాక నాలుగో దశ (ఫేజ్-4) క్లినికల్ పరీక్షలు నిర్వహించి, ఆ డేటాను సమర్పించాలని కంపెనీలను ఆదేశించింది. ఈ ఇంజెక్షన్‌ను హెచ్ఐవీ ముప్పు అధికంగా ఉన్నవారు (కనీసం 35 కిలోల బరువు ఉండాలి) ఏడాదికి రెండుసార్లు తీసుకోవాల్సి ఉంటుంది. అంతర్జాతీయ ఫార్మా సంస్థ గిలీడ్ సైన్సెస్‌కు "లెనాకాపవిర్" ఔషధంపై పేటెంట్ ఉంది. అయితే, ఎలాంటి రాయల్టీ తీసుకోకుండా భారత్‌తో పాటు 120 అల్పాదాయ దేశాల్లో ఈ మందును తయారు చేసేందుకు గిలీడ్ పలు కంపెనీలకు లైసెన్సులు మంజూరు చేసింది. అమెరికా, ఈయూ దేశాల్లో దీని వార్షిక ఖర్చు రూ. 27 లక్షల నుంచి రూ. 40 లక్షల వరకు ఉండగా, జెనరిక్ రాకతో భారత్‌లో ప్రస్తుతం ఉన్న ధర కంటే 50 నుంచి 70 శాతం వరకు తగ్గుతుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.



**-ఆరిజెన్‌కు భారీ కాంట్రాక్టు**

డాక్టర్ రెడ్డీస్ అనుబంధ సంస్థ అయిన ఆరిజెన్ ఫార్మా ఒక అంతర్జాతీయ కంపెనీ నుంచి భారీ కాంట్రాక్టును దక్కించుకుంది. ఈ ఒప్పందం కింద దీర్ఘకాలం పాటు స్టెరైల్ ఇంజెక్టబుల్స్, బయోలాజిక్స్ తయారు చేసి సరఫరా చేయనుంది. కాంట్రాక్టులోని షరతుల కారణంగా భాగస్వామ్య కంపెనీ పేరును వెల్లడించలేదు.

## డెలాయిట్‌కు భారీ షాక్.. అమెరికా కేసులో రూ.180 కోట్ల సెటిల్‌మెంట్!




అమెరికాకు చెందిన ప్రముఖ కన్సల్టింగ్ సంస్థ డెలాయిట్ ఓ కేసు సెటిల్ మెంట్ కింద భారీ మొత్తాన్ని చెల్లించేందుకు అంగీకరించింది. ఉద్యోగ నియామకాల్లో జాతి, లింగాన్ని పరిగణనలోకి తీసుకున్నారన్న ఆరోపణలపై అమెరికా ప్రభుత్వం చేపట్టిన దర్యాప్తును ముగించేందుకు 21.5 మిలియన్ డాలర్లు (దాదాపు రూ. 180 కోట్లు) చెల్లించనుంది. అయితే తాము ఎలాంటి తప్పు చేయలేదని డెలాయిట్ స్పష్టం చేసింది. అమెరికా న్యాయశాఖ (డీఓజే) ఆరోపణల ప్రకారం.. సంస్థలో ఉద్యోగుల జాతి, లింగ నిష్పత్తికి సంబంధించి అంతర్గత లక్ష్యాలు ఉండేవి. నియామకాలు, పదోన్నతులు, ఉద్యోగుల కేటాయింపుల్లో ఈ అంశాలను పరిగణనలోకి తీసుకున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. కొన్ని విభాగాల పురోగతిని ఈ లక్ష్యాలతో పోల్చి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చేవారని తెలిపింది. దాదాపు రెండేళ్లపాటు 150 మంది సీనియర్ పార్ట్‌నర్లు, ప్రిన్సిపల్స్, మేనేజింగ్ డైరెక్టర్ల పనితీరు ఆధారిత చెల్లింపులపై కూడా ఈ లక్ష్యాల ప్రభావం ఉండొచ్చని డీఓజే ఆరోపించింది. స్ప్రింగ్‌బోర్డ్, కంపాస్ వంటి కార్యక్రమాల్లోనూ జాతి, లింగం ఆధారంగా అర్హతలు పరిమితం చేసినట్లు పేర్కొంది. డెలాయిట్ మాత్రం ఆరోపణ లను అంగీకరించలేదు. సుదీర్ఘ న్యాయపోరాటంతో వచ్చే ఖర్చు, అనిశ్చితి, సంస్థకు కలిగే అంతరాయాన్ని నివారించేందుకే సెటిల్‌మెం ట్‌కు అంగీకరించినట్లు తెలిపింది. ఈ ఒప్పందం తమ తప్పును అంగీకరించినట్లు కాదని స్పష్టం చేసింది.

## ఫోక్స్‌వ్యాగన్‌లో తీవ్ర సంక్షోభం.. 50 వేల ఉద్యోగాలకు ఎసరు?

ప్రపంచ ఆటో దిగ్గజం ఫోక్స్‌వ్యాగన్ తీవ్ర సంక్షోభంలో చిక్కుకుంది. అమ్మకాలు తగ్గడం, చైనా కంపెనీల నుంచి పోటీ పెరగడం, ఉత్పత్తి వ్యయాలు అధికంగా ఉండటంతో భారీ పునర్వ్యవస్థీకరణకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా 50 వేల వరకు ఉద్యోగాలు తగ్గించే అవకాశం ఉంది. దీంతో జర్మనీలో ఉద్యోగుల ఆగ్రహం తీవ్ర స్థాయికి చేరింది. ఫోక్స్‌వ్యాగన్ ప్రధాన కార్యాలయం ఉన్న వోల్ఫ్స్‌బర్గ్‌లో మంగళవారం 10 వేల మందికి పైగా కార్మికులు గుమికూడారు. సంస్థను పోటీకి తగినట్లు మార్చుకోవాల్సిన అవసరం ఉందని సీఈవో ఒలివర్ బ్లూమ్ వారికి చెప్పారు. అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. బ్లూమ్ ప్రసంగానికి కార్మికుల నుంచి తీవ్ర నిరసన ఎదురైంది. కొందరు ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 50 వేల ఉద్యోగాల కోతపై యాజమాన్యం చర్చిస్తోంది. ఇందులో సగం వరకు జర్మనీలో ఉండొచ్చని తెలుస్తోంది. అయితే ఇవి ప్రస్తుతం పరిశీలిస్తున్న అవకాశాలేనని కంపెనీ స్పష్టం చేసింది. స్వచ్ఛంద పదవీ విరమణ, ముందస్తు రిటైర్‌మెంట్, కొత్త నియామకాలపై ఆంక్షల ద్వారా ఉద్యోగుల సంఖ్యను తగ్గించాలని భావిస్తోంది. జర్మనీలోని పలు ప్లాంట్ల భవిష్యత్తుపైనా అనిశ్చితి నెలకొంది. ఒస్నాబ్రూక్ ప్లాంట్‌లో వచ్చే ఏడాది ఉత్పత్తి నిలిచిపోనుంది. మరో నాలుగు ప్లాంట్ల భవిష్యత్తు 2030 తర్వాత ఎలా ఉంటుందన్నది స్పష్టంగా లేదు. ఫోక్స్‌వ్యాగన్‌కు చైనా కార్ల తయారీ సంస్థల నుంచి గట్టి పోటీ ఎదురవుతోంది.



ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనాల విభాగంలో చైనా కంపెనీలు వేగంగా ఎదుగుతున్నాయి. చైనాలో ఫోక్స్‌వ్యాగన్ అమ్మకాలు కూడా తగ్గాయి. అమెరికా టారిఫ్‌లు, అధిక ఉత్పత్తి వ్యయాలు సమస్యను మరింత పెంచుతున్నాయి.

# స్పోర్ట్స్

## కొలంబో టెస్టు: ముందే ముగిసిన నాలుగో రోజు ఆట విజయానికి చేరువలో టీమిండియా




భారత్, శ్రీలంక మధ్య కొలంబో వేదికగా జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్ ఉత్కంఠభరిత దశకు చేరుకుంది. అయితే, కీలకమైన నాలుగో రోజు ఆటలో వర్షం పదేపదే అంతరాయం కలిగించడంతో అంపైర్లు ఆటను ముందుగానే రద్దు చేశారు. ఆట ముగిసే సమయానికి, ఫాలోఆన్ ఆడుతున్న శ్రీలంక రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్ల నష్టానికి 229 పరుగులు చేసింది. ప్రస్తుతం 16 పరుగుల స్వల్ప ఆధిక్యంలో ఉన్నప్పటికీ, మ్యాచ్ పూర్తిగా భారత్ నియంత్రణలో ఉంది. నాలుగో రోజు ఉదయం శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌ను 290 పరుగుల వద్ద ముగించిన భారత్, వెంటనే ఫాలోఆన్ ఇచ్చింది. తొలి ఇన్నింగ్స్‌తో పోలిస్తే రెండో ఇన్నింగ్స్‌లో శ్రీలంక బ్యాటర్లు మెరుగైన ఆటతీరు కనబరిచారు. ముఖ్యంగా, మరోసారి అద్భుతంగా ఆడిన పసిందు సూరియ బండార (92), కమిందు మెండిస్ (55) భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నారు. ఈ ఇద్దరూ మూడో వికెట్‌కు కీలకమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పి, శ్రీలంకకు మంచి ఆధిక్యం అందించేలా కనిపించారు. వీరి నిలకడతో శ్రీలంక శిబిరంలో ఆశలు చిగురించాయి. అయితే, దూకుడుగా ఆడే క్రమంలో కమిందు మెండిస్ చేసిన ఒక పొరపాటు మ్యాచ్‌ను మలుపు తిప్పింది. ప్రసిద్ధ్ కృష్ణ బౌలింగ్‌లో అనవసర షాట్‌కు ప్రయత్నించి స్క్వేర్ లెగ్ వద్ద గాల్లోకి బంతిని లేపాడు. అక్కడ ఫీల్డింగ్ చేస్తున్న శుభ్‌మన్ గిల్ వెనక్కి పరుగెత్తుతూ అద్భుతమైన క్యాచ్ అందుకోవడంతో శ్రీలంక పతనం ప్రారంభమైంది. ఆ వికెట్ పడిన తర్వాత టీమిండియా పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. కొద్దిసేపటికే, సెంచరీకి చేరువలో ఉన్న సూరియబండారను మానవ్ సుతార్ పెవిలియన్ చేర్చాడు. ఆ తర్వాత వచ్చిన కెప్టెన్ ధనంజయ డి సిల్వా (23), నిరోషన్ డిక్వెల్లా (6) కూడా ఎక్కువసేపు నిలవలేకపోయారు. వర్షం కారణంగా ఆట నిలిపివేసే సమయానికి, సోనల్ దినుషా (7), కేశర నువంత (3) క్రీజులో ఉన్నారు. మరో 8 ఓవర్లలో కొత్త బంతి అందుబాటులోకి రానుండటం భారత బౌలర్లకు మరింత అనుకూలించే అంశం. ఐదో రోజు వర్షం ముప్పు ఉన్నప్పటికీ, వాతావరణం అనుకూలిస్తే మ్యాచ్ ఫలితం తేలడం ఖాయం. ఈ మ్యాచ్‌లో గెలవాలంటే భారత్ మరో 4 వికెట్లు పడగొట్టి, ఆపై లక్ష్యాన్నిఛేదించాల్సి ఉంటుంది. బౌలర్లలో మానవ్ సుతార్ రెండు వికెట్లు తీయగా, సిరాజ్, ప్రసిద్ధ్, జడేజా, సారాంశ్ జైన్ తలో వికెట్ సాధించారు.

## వరల్డ్ నంబర్ వన్ బౌలర్‌గా స్టార్క్ రెండోస్థానానికి పడిపోయిన బుమ్రా




అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) బుధవారం విడుదల చేసిన తాజా టెస్ట్ ర్యాంకింగ్స్‌లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. బౌలింగ్ విభాగంలో భారత స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఆధిపత్యానికి తెరదించుతూ ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ తొలిసారిగా నంబర్ వన్ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. అదే సమయంలో, భారత వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ బ్యాటింగ్ జాబితాలో ఆరు స్థానాలు ఎగబాకి ఏడో ర్యాంకుకు చేరుకున్నాడు. బంగ్లాదేశ్‌తో జరిగిన రెండో టెస్టులో మిచెల్ స్టార్క్ కనబరిచిన అద్భుత ప్రదర్శనే అతడికి ఈ అగ్రస్థానాన్ని అందించింది. ఆ మ్యాచ్‌లో మొత్తం 10 వికెట్లు పడగొట్టడం ద్వారా స్టార్క్ రెండు స్థానాలు మెరుగుపరుచుకున్నాడు. దీంతో అప్పటివరకు అగ్రస్థానంలో ఉన్న బుమ్రాతో పాటు న్యూజిలాండ్ బౌలర్ మ్యాట్ హెన్రీని అధిగమించాడు. మరోవైపు, శ్రీలంకతో జరుగుతున్న ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సిరీస్‌కు బుమ్రా దూరంగా ఉండటం అతని ర్యాంకింగ్‌పై ప్రభావం చూపింది. ఈ మార్పులతో బుమ్రా రెండో స్థానానికి, హెన్రీ మూడో స్థానానికి పడిపోయారు. 36 ఏళ్ల స్టార్క్‌కు తన 15 ఏళ్ల సుదీర్ఘ టెస్ట్ కెరీర్‌లో నంబర్ వన్ ర్యాంక్ అందుకోవడం ఇదే మొదటిసారి. ఎక్కువ కాలం టాప్ 10లో ఉన్నప్పటికీ, అగ్రపీఠాన్ని ఎన్నడూ చేరలేదు. బౌలింగ్ జాబితాలో ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్ ఒక స్థానం మెరుగుపరుచుకుని నాలుగో ర్యాంకుకు, స్పిన్నర్ నాథన్ లైయన్ రెండు స్థానాలు ఎగబాకి పదో స్థానంలో నిలిచారు.

VARTHAA SAKSHAMU RNI.Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# ధనుష్ చేతుల మీదుగా జీవీ ప్రకాశ్ ‘ఇమ్మోర్టల్’ ట్రైలర్.. ఆద్యంతం ఉత్కంఠ!

ప్రముఖ నటుడు, సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్ కుమార్, కయాదు లోహర్ జంటగా నటించిన హారర్ థ్రిల్లర్ ‘ఇమ్మోర్టల్’. మరియప్పన్ చిన్న దర్శకత్వం వహించిన ఈ చిత్రం ట్రైలర్‌ను స్టార్ హీరో, నిర్మాత ధనుష్ బుధవారం విడుదల చేశారు. తన ఎక్స్ ఖాతాలో ట్రైలర్‌ను పంచుకుంటూ.. “ఇదిగో ‘ఇమ్మోర్టల్’ ట్రైలర్.. జీవీ ప్రకాశ్ కు ఆల్ ది బెస్ట్” అని చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ట్రైలర్‌ను పరిశీలిస్తే, ఇది ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. విదేశీ గిరిజన జంట తమ బిడ్డ కోసం ఎదురుచూసే సన్నివేశంతో ట్రైలర్ ప్రారంభమవుతుంది. ఆ తర్వాత కథ భారతదేశానికి మారుతుంది. ఇక్కడ మహి (జీవీ ప్రకాశ్) షేరింగ్ పద్ధతిలో ఉండటానికి ఒక గది కోసం వెతుకుతుంటాడు. ఆ సమయంలో సింధు (కయాదు లోహర్) నుంచి అతనికి ఫోన్ వస్తుంది. తాను ఒంటరిగా ఉంటున్నానని, రూమ్ మేట్ కోసం చూస్తున్నానని ఆమె చెబుతుంది. అందమైన, ధనవంతు రాలైన సింధును చూసి ఇష్టపడిన మహి, వెంటనే ఆమె గదికి మారిపోతాడు. ఆమెతోనే జీవితంలో స్థిరపడాలని నిర్ణయించుకుంటాడు. అయితే, ఆ ఫ్లాట్‌లో అడుగుపెట్టి నప్పటి నుంచి మహి జీవితంలో ఊహించని, భయానక సంఘటనలు చోటుచేసుకుంటాయి. ఆ పరిణామాలు అతడిని పిచ్చివాడిని చేస్తాయి. ఆశ్చర్యకరంగా, ఫ్లాట్‌లో ఏం జరుగుతుందో సింధుకు ముందే తెలిసినట్లుగా ట్రైలర్‌లో చూపించడం కథపై ఆసక్తిని మరింత పెంచుతోంది. ఇప్పటికే ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు ఎలాంటి కోతలు లేకుండా ‘ఖ’ సర్టిఫికెట్ జారీ చేసింది. సెప్టెంబర్ 4న ఈ సినిమాను థియేటర్లలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. వాస్తవానికి ఈ ఏడాది మే నెలలోనే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని అప్పుడే విడుదల చేయాలని భావించినా, కొన్ని కారణాల వల్ల వాయిదా పడింది. గతేడాది విడుదలైన టీజర్ సైతం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోవడంతో సినిమాపై మంచి అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో టీఎమ్ కార్తీక్, కుమార్ నటరాజన్, లొల్లు సభ మారన్, ఆదిత్య కతిర్, అర్షు మహర్జన్ వంటి వారు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అరుణ్‌కుమార్ ధనశేఖరన్ నిర్మించిన ఈ చిత్రానికి అరుణ్ రాధాకృష్ణన్ సినిమాటోగ్రఫీ అందించగా, సామ్ సీఎస్ సంగీతం సమకూర్చారు. శాన్ లోకేశ్ ఎడిటర్‌గా, శివ శంకర్ ఆర్ట్ డైరెక్టర్‌గా వ్యవహరించారు.




# గర్భంతోనూ జిమ్‌లో సమంత





గర్భధారణ సమయంలో తన ఫిట్‌నెస్ రొటీన్ ఎలా మారిందో నటి సమంత వెల్లడించింది. జిమ్‌లో వర్కౌట్ చేస్తున్న ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో పంచుకుంది. ఇన్నాళ్లూ శరీరాన్ని మరింతగా శ్రమ పెట్టేలా శిక్షణ తీసుకున్నానని.. ఇప్పుడు శరీరం చెప్పేది వినడం నేర్చుకుం టున్నానని తెలిపింది.దసమంత ఎన్నో ఏళ్లుగా శక్తిని పెంచే వ్యాయామాలు చేస్తున్నట్లు చెప్పింది. గర్భ ధారణ సమయంలోనూ వ్యాయామం కొనసాగిం చేందుకు వైద్యుడి అనుమతి తీసుకున్నానని తెలిపింది. తన ట్రైనర్‌కు గర్భధారణ సమయంలో వ్యాయామాలపై ప్రత్యేక శిక్షణ ఉందని వెల్లడించింది. తన శరీరం, గత అనుభవం, గర్భధారణ పరిస్థితికి తగ్గట్టుగా వర్కౌట్స్‌లో మార్పులు చేసినట్లు వివరించింది. ప్రతి ఒక్కరి గర్భధారణ ఒకేలా ఉండదని సమంత చెప్పింది. తన వర్కౌట్స్‌ను ఇతరులు అనుసరించొద్దని సూచించింది. వ్యాయామం చేసే ముందు వైద్యుడిని సంప్రదించాలని.. నిపుణులైన ట్రైనర్ సాయం తీసుకోవాలని కోరింది. తాను పంచుకున్న వీడియోలో ఛాతీకి సంబంధించిన వ్యాయామం చేసింది. అయితే గతంలోలా ఎక్కువ బరువు ఎత్తడంపై కాకుండా.. శరీరం ఇచ్చే సంకేతాలను గమనించడంపైనే ఇప్పుడు దృష్టి పెట్టినట్లు చెప్పింది. కొన్ని రోజులు వ్యాయామాన్ని తగ్గిస్తున్నానని తెలిపింది. కొన్ని రోజులైతే వర్కౌట్ మొత్తం నేలపై పడుకోవడంతోనే పూర్తవుతోందని సమంత సరదాగా వ్యాఖ్యానించింది. ఇన్నేళ్లుగా తన శరీరాన్ని మరింత పని చేయడానికి సిద్ధం చేశానని.. ఇప్పుడు తక్కువ పని చేయమని శరీరం అడిగినప్పుడు దాన్ని గౌరవించడం నేర్చుకుం టున్నానని పేర్కొంది. చిన్న ప్రాణాన్ని మోస్తున్న సమయంలో లక్ష్యాలు కూడా మారిపోతాయని సమంత అభిప్రాయ పడింది. తన శరీరం ఇప్పటివరకు చేసిన పనుల్లో ఇదే అత్యంత బలమైన పని కావచ్చని పేర్కొంది. సమంత 2026 జూన్‌లో తన గర్భధారణ విషయాన్ని బహిరంగంగా వెల్లడించింది. భర్త రాజ్ నిడిమోరుతో కలిసి తొలి బిడ్డకు స్వాగతం పలకబోతున్నట్లు ప్రకటించింది.



## ‘ప్రేమలు’ మేకర్స్ నుంచి మరో ఫీల్ గుడ్ మూవీ ‘బెత్లెహేం కుటుంబ యూనిట్’

మలయాళంలో సంచలనం సృష్టించి, తెలుగులోనూ భారీ విజయాన్ని అందుకున్న ‘ప్రేమలు’ చిత్రాన్ని అందించిన టీమ్ నుంచి మరో ఫీల్ గుడ్ ఎంటర్‌టైనర్ రాబోతోంది. గిరీశ్ ఏడీ దర్శకత్వంలో తెరకెక్కిన ‘బెత్లెహేం కుడుంబ యూనిట్’ అనే మలయాళ చిత్రాన్ని తెలుగులో ‘బెత్లెహేం కుటుంబ యూనిట్’ పేరుతో విడుదల చేయనున్నారు. నివిన్ పాలీ, ‘ప్రేమలు’ ఫేమ్ మమితా బైజు జంటగా నటించిన ఈ సినిమా సెప్టెంబర్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. చిన్న సినిమాగా విడుదలై తెలుగు రాష్ట్రాల్లో సంచలన విజయం సాధించింది ‘ప్రేమలు’. ముఖ్యంగా యువతను ఈ చిత్రం విపరీతంగా ఆకట్టుకుంది. ఇప్పుడు అదే దర్శకుడు గిరీశ్ ఏడీ, ఎవే నిర్మాణ సంస్థ భావన స్టూడియోస్ నుంచి వస్తున్న సినిమా కావడంతో ‘బెత్లెహేం కుటుంబ యూనిట్’పై అంచనాలు భారీగా పెరిగాయి. ‘ప్రేమలు’ తరహాలోనే ఇది కూడా ఒక స్వచ్ఛమైన రొమాంటిక్ కామెడీ అని చిత్రబృందం చెబుతోంది. ఈ చిత్రంలో మలయాళ స్టార్ హీరో నివిన్ పాలీ కథానాయకుడిగా నటించగా, ‘ప్రేమలు’తో తెలుగులో ఎంతో క్రేజ్ సంపాదించుకున్న మమితా బైజు హీరోయిన్‌గా నటించింది




PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.